


నక్సల్స్‌తో చర్చల ప్రసక్తి లేదు
కేంద్రమంత్రి బండి సంజయ్

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 2 సంచిక -61 మంగళవారం 6 మే 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# రాజకీయ ఉచ్చులో సమిధలు కావద్దు..!

## ఉద్యోగ సంఘాల సమ్మె ప్రకటనలపై సిఎం రేవంత్

- రూపాయి అప్పుకూడా పుట్టని పరిస్థితి
- సమరం కాదు..సంయమనం కావాలి
- మీకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నాం
- కలసి పని చేస్తేనే తెలంగాణ బలపడుతుంది

ఖజానా అంతంతమాత్రంగానే ఉన్నా..ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని, అందుకు ఉద్యోగులు సమరం చేస్తారా? - సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,,మే 5(జర్నలిస్టు వార్త):** ఖజానా అంతంతమాత్రంగానే ఉన్నా..ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని, అందుకు ఉద్యోగులు సమరం చేస్తారా అని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారని ప్రశ్నించారు. తనను కోసినా సరే.. వచ్చిన ఆదాయానికి మించి ఖర్చు చేయలేనని సీఎం స్పష్టం చేశారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా? మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ బకాయిలు పెట్టి వెళ్లారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయి. ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా.. సమస్య ఉంటే చర్చించుకుందాని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా అని రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి.**మిగతాది** 2లో...

# మాక్ డ్రిల్స్ నిర్వహించండి

- రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచన
- పహల్గామ్ దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తం
- భద్రతా సంసిద్ధతను సమీక్షించాలని రాష్ట్రాలకు సూచన
- పౌరులకు అత్యవసర స్పందనపై అవగాహన కల్పించాలని స్పష్టీకరణ

పహల్గామ్‌లో ఇటీవల చోటు చేసుకున్న ఉగ్రవాద దాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దేశవ్యాప్తంగా భద్రతా సంసిద్ధతను సమీక్షించి, పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా, అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అప్రమత్తంగా ఉండాలని, భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేయాలని సూచించింది. భద్రతా పరమైన సంసిద్ధతను పరీక్షించేందుకు వీలుగా ఈ బుధవారం ప్రత్యేకంగా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కీలక సూచనలు జారీ చేసింది. అంతేకాకుండా, ఈ మాక్ డ్రిల్స్ సందర్భంగా భద్రతా సన్నద్ధతపై సాధారణ పౌరులకు కూడా అవగాహన కల్పించాలని కేంద్రం స్పష్టం చేసింది. ఏదైనా ఊహించని, అత్యవసర పరిస్థితి తలెత్తితే ఏ విధంగా స్పందించాలి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై ప్రజలకు తెలియజేయాలని సూచించింది.



# తెలంగాణ దివాలా తీయలేదు

- మేధోపరంగా, నైతికంగా కాంగ్రెస్ దివాలా తీసింది
- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్
- నేడు మ.12 గంటలకు రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై
- కెటిఆర్ మీడియా సమావేశం

**హైదరాబాద్ మే 5(జర్నలిస్టు వార్త):** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. రాష్ట్రం దివాలా తీయలేదు మిస్టర్ ‘చీఫ్ మినిస్టర్’ అంటూ ట్వీట్ చేశారు. నిజానికి మేధోపరంగా దివాలా తీసింది, నైతికంగా దిగజారింది మీరూ, మీ అవినీతి కాంగ్రెస్ పార్టీయే అంటూ ఘాటుగా విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు మీడియా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు కెటిఆర్ తెలిపారు.





# తెలంగాణ రూపురేఖలు మార్చేస్తాం..

## రూ. 2 లక్షల కోట్ల హైవే ప్రాజెక్టులు: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

### తెలంగాణలో రూ.2 లక్షల కోట్ల హైవే పనులు: గడ్కరీ

**హైదరాబాద్ మే 5(జర్నలిస్టు వార్త):** రాబోయే మూడు, నాలుగేళ్లలో తెలంగాణ రాష్ట్రంలో సుమారు రూ. 2 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను చేపట్టనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం ప్రకటించారు. ఈ భారీ ప్రాజెక్టులతో తెలంగాణ రూపురేఖలు సంపూర్ణంగా మారిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్‌లో రూ. 3,900 కోట్ల విలువైన జాతీయ రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

మిగతా 2లో

# రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో భూకంపం

- కొన్ని సెకన్ల పాటు భూప్రకంపనలు
- రిక్టర్ స్కేలుపై 3.8 గా నమోదు
- భయాందోళనలతో పరుగులు తీసిన ప్రజలు




2లో

# నేటి అర్ధరాత్రి నుంచి ఆర్‌టిసి సమ్మె

## డిపోలకే పరిమితం కానున్న బస్సులు - రెండుగా చీలిన జెఎసిలు



**హైదరాబాద్ మే 5(జర్నలిస్టు వార్త):** తమ సమస్యల పరిష్కారం కోసం ఆర్‌టిసి కార్మికులు సమ్మెకు సన్నద్ధమయ్యారు. మంగళవారం అర్ధరాత్రి నుండి సమ్మెలోకి వెళ్తున్నారు. దీంతో మే 7వ తేదీ నుండి రాష్ట్రంలో బస్సులు డిపోలకే పరిమితం కానున్నాయి. అయితే అశ్వత్థామ రెడ్డి నేతృత్వంలోని ఆర్‌టిసి జెఎసి సమ్మెకు దూరంగా ఉంది. దీంతో ఆర్‌టిసి సంఘాలు రెండు జెఎసీలుగా చీలి పోయాయి. వెంకన్న నేతృత్వంలోని ఆర్‌టిసి జెఎసి సమ్మె నోటీసు ఇచ్చి 7 నుండి సమ్మెకు వళు తుండగా అశ్వత్థామ రెడ్డి నేతృత్వంలోని జెఎసి సమ్మెకు దూరంగా ఉంటూ విధులకు హాజరవుతోంది. అశ్వత్థామరెడ్డి జెఎసిలో ఎన్ఎంయు, కార్మిక సంఘ్, ఎస్‌టిఎంయు సంఘాలు సమ్మెకు దూరంగా ఉన్నాయి.లవెంకన్న చైర్మన్‌గా ఉన్న జెఎసిలో ఎంప్లాయిస్ యూనియన్, టిజెఎంయు, టిఎంయు, ఎన్ఎంయు, బికెయు, బిడబ్లుయు, కెపి సంఘాలు సమ్మెలో పాల్గొంటున్నాయి. అశ్వత్థామ రెడ్డి జెఎసికి కార్మిక మద్దతు లేదని, ప్రభుత్వం, ఆర్‌టిసి యాజమాన్యం సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి వారిని ఉసిగొల్పుతోందని వెంకన్న అన్నారు. సమ్మె పూర్తిగా విజయవంతం అవుతుందని పేర్కొన్నారు. తాము ఇదివరకే సమ్మె నోటీసు ఇచ్చామని, అశ్వత్థామ రెడ్డి వర్గం సమ్మె నోటీసు ఇవ్వలేదని ఆయనన్నారు. తాము సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం నుండి చర్చలకు పిలుపు రాలేదని, గత్యంతరం లేక సమ్మెలోకి వెళ్ళాల్సి వస్తోందని వెంకన్న అన్నారు.

# మిస్‌వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

- ఎక్కడా లోపం రాకుండా పటిష్ట ఏర్పాట్లు
- మే10నుంచి 31 వరకు పోటీలపై ప్రత్యేక చర్యలు
- చారిత్రక ప్రాంతాల్లో పర్యటించే వారికి సదుపాయాలు
- అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్



2లో

# నక్సల్స్‌తో చర్చల ప్రసక్తి లేదు

## తుపాకీ చేతపట్టిన వారితో చర్చలేమిటి

## కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టీకరణ



**పెద్దపల్లి మే 5(జర్నలిస్టు వార్త):** మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదనే విషయాన్ని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి,కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ మరోసారి స్పష్టం చేశారు. ఈ మేరకు రామగుండంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. తుపాకీ చేతపట్టి అమాయకులను చంపుతుంటే చర్చలేంటని సంజయ్ ప్రశ్నించారు. ఆ చావులకు మీరేం సమాధానం చెబుతారంటూ బండి సంజయ్ ఎదురు ప్రశ్నించారు. కాంగ్రెస్ రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తోంది. మావోయిస్టులు దశాబ్దాలుగా అమాయకులను కాల్చి చంపిన సంగతి గుర్తు లేదా?, మావోయిస్టుల సానుభూతి పరులు సాధించిందేంటని అన్నారు. వారిపై నిషేధం విధించింది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా అని అన్నారు. మావోయిస్టులు ఎవరున్నా తుపాకీ వీడి లొంగిపోవాల్సిందే.. జన జీవన స్రవంతిలో కలవాల్సిందే. పౌర హక్కుల సంఘం నేతలారా.. నక్సల్స్ నచ్చుజెప్పండని బండి సంజయ్ స్పష్టం చేశారు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు. కేవలం సర్వే మాత్రమే జరిగిందన్నారు. ఇక్కడ బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం చేసింది కులగణన కానేకాదన్నారు. ప్రతి ఇంటికి కచ్చితంగా వెళ్లి నిర్వహించేది కులగణన అని అన్నారు. జనగణన మాదిరిగానే మోదీ ప్రభుత్వం కులగణన చేస్తుందన్నారు. బీసీలకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామన్నారు బండి సంజయ్.

# గవర్నర్ తో బిసి సంఘాల భేటీ

## బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదించినందుకు గవర్నర్ కు ధన్యవాదాలు



**హైదరాబాద్ ,మే 5(జర్నలిస్టు వార్త):** బిసి సంఘాల నేతలు సోమవారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను రాజ్‌భవన్‌లో కలిశారు. అసెంబ్లీ ఆమోదించిన బిసి రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బిసి సంఘాల ప్రతినిధుల బృందం గవర్నర్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో జరిగిన కులగనణ, అసెంబ్లీలో బిసి రిజర్వేషన్లపై ఏకగ్రీవంగా చేసిన బిసి బిల్లు, ఇటీవల కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా జనాభా లెక్కలలో సమగ్ర కులగణను చేపట్టాలని నిర్ణయించడం తదితర అంశాలపై గవర్నర్‌తో జరిగిన భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఈ సందర్భంగా వెల్లడించారు. జాతీయ స్థాయిలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించాడాన్ని అభినందిస్తూ ప్రధాని నరేంద్ర మోడీకి, కేంద్ర క్యాబినెట్ గవర్నర్ ద్వారా బిసి ప్రతినిధుల బృందం ధన్యవాదాలు తెలిపినట్లు తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో బిసి ఉద్యమం రోజురోజుకు బలపడుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వంతో గవర్నర్ తమ విశిష్ట అధికారాలను ఉపయోగించి 42 బిసి రిజర్వేషన్ల బిల్లు ఆమోదం పొందేలా, దేశంలోని సామాజిక రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేసేలా, కేంద్రంలో ఓబిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు. గవర్నర్‌ని కలిసిన ప్రతినిది బృందంలో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, కన్వీనర్ బాలగోని బాలరాజు గౌడ్, బిసి సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి సాగర్ తదితరులు ఉన్నారు. ఇబిసి సంక్షేమ సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు వల్లపు రెడ్డి రవీందర్ రెడ్డి నేతృత్వంలో ప్రతినిధి బృందం గవర్నర్‌ను కలిసి అగ్రవర్ణ పేదల అభ్యున్నతికి ఇబిసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరింది. రాష్ట్రంలో అగ్రకులాల్లో 90 శాతం కుటుంబాలు పేదరికంలో మగ్గుతూ దారిద్రంలో జీవిస్తున్నారని ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి తెలిపారు. రెడ్లు, ఆర్యవైశ్యులు, బ్రహ్మణులు, క్షత్రీయులు, కమ్మ, వెలమ, ముస్లిం, బలిజ, ఒంటరి, తెలగ తదితర కులాలకు చెందిన వారు కూడు, గుడ్డ, గూడు లేకుండా ఎంతో మంది జీవిస్తున్నారని తెలిపారు. వారి సంక్షేమం కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలన్నారు.

# రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో స్వల్ప భూకంపం




**హైదరాబాద్, మే 5(జర్నలిస్టు వార్త):** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భూమి కంపించింది. పలు ప్రాంతాలలో కొన్ని సెనక్ల పాటు భూప్రకంపనలు సంభవించాయి. కొమురంభీం ఆసిబాద్ జిల్లా గోలేటి సమీపంలో పులికుంట కేంద్రంగా సోమవారం సాయంత్రం 6 గంటల 50 నిమిషాలకు భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై దీని తీవ్రత 3.8 గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజి అధికారులు పేర్కొన్నారు. మంచిర్యాల, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్, కరీంనగర్ జిల్లా వేములవాడ, గంగాధర, చొప్పదండి, రామడుగు, నిజాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, మోర్తాడ్, సిరికొండ మండలాల్లో భూమి 2 సెకన్ల పాటు కంపించింది. మరోవైపు నిర్మల్ జిల్లాలోని ఖానాపూర్, కడెం, లక్ష్మణచందా, జన్నారం మండలాల్లో 2 నుంచి 5 సెకన్ల పాటు భూ ప్రకంపనలు సంభవించాయి.అనూహ్య పరిణామాలతో హడలెత్తిన ప్రజలు భయంతో ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలో భూ ప్రకంపనలతో పల్లె అర్జున్ అనే రైతు ఇల్లు కూలిపోగా, ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఆయన కుటుంబ సభ్యులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. దాంతో వారు పెను ప్రమాదం నుండి సురక్షితంగా బయటపడ్డారు. కాగా, ఇటీవల రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భూమి కంపించిన విషయం తెలిసిందే. ఆ సమయంలోనే మరోసారి భూకంపం వచ్చే అవకాశం ఉందని నిపుణులు హచ్చరికలు జారీ చేశారు. తమ పరిశోధనల ఆధారంగా తెలంగాణలో రామగుండంతో పాటు పలు సమీప ప్రాంతాల్లో భారీ భూకంపం సంభవించే ప్రమాదం ఉందని, ఆ ప్రకంపనలు హైదరాబాద్, వరంగల్, అమరావతి వరకు చేరే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని రెబ్బెన మండలం గోలేటి గ్రామ పరిసర ప్రాంతాలను జాతీయ భూకంప కేంద్రంగా ఎన్‌సిఎస్ నిర్ధారించింది.

# తెలంగాణ రూపురేఖలు మార్చేస్తాం..

(మొదటి పేజి తరువాయి)



ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు రూ. లక్ష కోట్ల విలువైన కొత్త గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే హైవే ప్రాజెక్టుల పనులు చురుకుగా సాగుతున్నాయని గడ్కరీ వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గణనీయంగా పుంజుకుంటుందని, యువతకు ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని, రవాణా సౌకర్యం మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. రద్దీ తగ్గడం, తక్కువ ఖర్చుతో ప్రయాణం సాధ్యపడటం, లాజిస్టిక్స్ సామర్థ్యం పెరగడం వంటి ప్రయోజనాలు కలుగుతాయని, తద్వారా రాష్ట్ర మౌలిక సదుపాయాల రంగంలో ఇదో కీలక ముందడుగు అవుతుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని గడ్కరీ స్పష్టం చేశారు.

2014లో తాను మంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి తెలంగాణలో జాతీయ రహదారుల పొడవు 2,511 కిలోమీటర్లు ఉండగా, ప్రస్తుతం అది దాదాపు రెట్టింపై 5,000 కిలోమీటర్లకు చేరిందని గడ్కరీ గుర్తుచేశారు. "తెలంగాణలో ఇప్పటికే రూ. 1.5 లక్షల కోట్ల పనులు పూర్తిచేశాం. కానీ ఇది ఆరంభం మాత్రమే. రాబోయే 3-4 ఏళ్లలో మరో రూ. 2 లక్షల కోట్ల విలువైన పనులు చేపడతాం. ఇవి కచ్చితంగా తెలంగాణ రూపురేఖలను మారుస్తాయని నేను విశ్వసిస్తున్నాను," అని ఆయన అన్నారు.

రాష్ట్రంలో చేపట్టిన కొన్ని కీలక గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రాజెక్టుల వివరాలను గడ్కరీ తెలియజేశారు:

ఇండోర్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌వే: రూ. 17,000 కోట్లతో 770 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో తెలంగాణ పరిధిలో 136 కి.మీ. ఉంటుంది. రాష్ట్రంలోని పనులకు (రూ. 4,500 కోట్లు) నూరు శాతం అనుమతులు పూర్తయ్యాయని, కామారెడ్డి, మెదక్, సంగారెడ్డి జిల్లాల గుండా వెళ్లే ఈ మార్గం మార్చి 2026 నాటికి పూర్తవుతుందని తెలిపారు. దీనివల్ల ఇండోర్-హైదరాబాద్ ప్రయాణ సమయం 20 గంటల నుంచి 10 గంటలకు తగ్గుతుంది.సూరత్-చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే: 1,100 కి.మీ.ల ఈ మార్గం తెలంగాణ మీదుగా కూడా వెళ్తుందని, ఇది ఉత్తర-దక్షిణాలను కలుపుతూ కశ్మీర్ నుంచి కన్యాకుమారి కలను నెరవేరుస్తుందని అన్నారు. వచ్చే ఏడాది ఇది పూర్తవుతుందని, తెలంగాణలో 78 కి.మీ. మేర (పొరుగున ఉన్న కర్నూలును కలుపుతూ) ఉంటుందని చెప్పారు. దీనివల్ల సూరత్-చెన్నై మధ్య దూరం 300 కి.మీ., ప్రయాణ సమయం 28 గంటల నుంచి 17 గంటలకు తగ్గుతుంది.సూర్యాపేట-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే: హైదరాబాద్-విశాఖపట్నం కారిడార్‌లో భాగంగా రూ. 8,000 కోట్లతో 221 కి.మీ.ల ఈ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో 164 కి.మీ. తెలంగాణలోని సూర్యాపేట, ఖమ్మం జిల్లాల గుండా వెళు_ుంది. దీనితో హైదరాబాద్-విశాఖ ప్రయాణ సమయం 12 గంటల నుంచి 6 గంటలకు తగ్గుతుంది.

నాగ్‌పూర్-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే: రూ. 16,000 కోట్లతో 565 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో 401 కి.మీ. (రూ. 13,328 కోట్లు) తెలంగాణలోనే ఉంటుంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల మీదుగా వెళ్లే ఈ మార్గం నాగ్‌పూర్-విజయవాడ మధ్య దూరాన్ని 175 కి.మీ., ప్రయాణ సమయాన్ని 13 గంటల నుంచి 6 గంటలకు తగ్గిస్తుంది.

హైదరాబాద్-పనాజీ కారిడార్: రూ. 20,000 కోట్లతో 563 కి.మీ.ల ఈ ప్రాజెక్టులో 90 కి.మీ. తెలంగాణలోని మహబూబ్‌నగర్, జడ్చర్ల మీదుగా వెళ్లి జాతీయ రహదారి 44ను కలుస్తుంది. ఇది హైదరాబాద్-పనాజీ ప్రయాణ సమయాన్ని 15 గంటల నుంచి 7 గంటలకు తగ్గిస్తుంది. వీటితో పాటు భద్రాచలం, బాసర, మేడారం వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలను జాతీయ రహదారులతో అనుసంధానించనున్నట్లు తెలిపారు. జగిత్యాల-కరీంనగర్ హైవే విస్తరణ పనులను కూడా త్వరలోనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టులతో తెలంగాణ-మహారాష్ట్ర మధ్య రోడ్డు రవాణా మరింత సులభతరం కానుందని అన్నారు.కొమరం భీమ్ ఆసిఫాబాద్, పక్కనున్న జిల్లాల వెనుకబాటుతనాన్ని ప్రస్తావించిన గడ్కరీ, వాటి అభివృద్ధికి నీరు, విద్యుత్, రవాణా, మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో (రైతుల ఆత్మహత్యలు అధికంగా ఉన్న చోట) తాను చేపట్టిన నీటి సంరక్షణ పనులను గుర్తుచేస్తూ, తెలంగాణలోని డ్యామ్‌లు, నీటి వనరుల పూడికను ఉచితంగా తీసి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంలో సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

పర్యావరణ పరిరక్షణ, రవాణా ఖర్చు తగ్గింపు లక్ష్యంగా పెట్రోల్ వాహనాలకు బదులుగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. విద్యుత్ వాహనాల వినియోగం పెరిగితే రవాణా ఖర్చు గణనీయంగా తగ్గుతుందని నితిన్ గడ్కరీ తెలిపారు.ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ ఉచ్చులో సమిధలు కావద్దు..!

(మొదటి పేజి తరువాయి)

వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దన్నారు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ, ఎక్కడా అప్పు పుట్టట్లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబం పరువును బజారున పడేయొద్దు. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి, సంయమనం. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దామని రేవంత్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం హయాం లో సమయానికి జీతాలు రాకున్న నోరు విప్పలేదు.. ఇప్పుడు వాళ్ల అడగకముందే జీతాలు ఇస్తోన్న సమరం చేస్తామంటున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కొన్ని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని.. రాజకీయ పార్టీల కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దని సూచించారు. రాష్ట్రం పూర్తిగా దివాలా తీసిన స్థితిలో ఉందని.. ఒక్కరూపాయి కూడా అప్పు పుట్టడం లేదని.. బ్యాంకులకు వెళితే దొంగలను చూసినట్లు- చూస్తున్నారని అన్నారు. అణాపైసా చిక్కడం లేదని.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని చెప్పినా ఎవరూ నమ్మడం లేదన్నారు. కనీసం గ్రామాల్లో రోడ్లు వేయాలనే పరిస్థితి నెలకొందని.. స్వీయ నియంత్రణ మాత్రమే దీనికి పరిష్కారమని తెలిపారు. సరిహద్దుల్లో సైనికుల్లా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి కాబట్టే.. తెలంగాణ రాష్ట్రం ప్రపంచస్థాయి పెట్టు-బడులను ఆకర్షించగలుగుతోందన్నారు. విధినిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటు-ంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు-, అదనపు ఎస్పీ, ఎస్పీ కుటుంబాలకు రూ. కోటిన్నర ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేరం జరగకుండా నియంత్రించే బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.

# మిస్‌వరల్డ్ పోటీలకు కట్టుదిట్టమైన భద్రత

**ఎక్కడా లోపం రాకుండా పటిష్ట ఏర్పాట్లు**

**మే10నుంచి 31 వరకు పోటీలపై ప్రత్యేక చర్యలు**

**చారిత్రక ప్రాంతాల్లో పర్యటించే వారికి సదుపాయాలు**

**అధికారులను ఆదేశించిన సిఎం రేవంత్**



**హైదరాబాద్ ,మే 5(జర్నలిస్టు వార్త):** మిస్ వరల్డ్ 2025 పోటీలు విజయవంతంగా నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రపంచ వ్యాప్తంగా 116 దేశాలకు చెందిన యువతులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని, ఎలాంటి లోటుపాట్టు లేకుండా వారికి ఆతిథ్యమివ్వాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.మే 10వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరిగే ప్రపంచస్థాయి పోటీల నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు- చేయాలని పోలీసు అధికారులను అప్రమత్తం చేశారు. తెలంగాణ ఖ్యాతిని విశ్వమంతటా పరిచయం చేసేందుకు ఉపయోగపడే మిస్ వరల్డ్ 2025 వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అన్నారు. పోటీదారులతో పాటు దేశ విదేశాల నుంచి ఈవెంట్ కవరేజీకి దాదాపు 3000 మంది మీడియా ప్రతినిధులు హాజరవుతారని అన్నారు. వివిధ దేశాల నుంచి పోటీలకు వచ్చే వారిని తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో స్వాగతించాలని, పోటీలు పూర్తయ్యేంత వరకు ఎక్కడా చిన్న పొరపాటు లేకుండా ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి అధికారులను హెచ్చరించారు. పర్యాటక శాఖతో పాటు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని, అధికారులు అంతా సమర్థంగా తమకు అప్పగించిన బాధ్యతలు నిర్వహించాలని ఆదేశించారు. మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సీఎంతో పాటు మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, డీజీపీ జితేందర్, సిటీ-పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు, ఏడీజీపీ స్టీఫెన్ రవీంద్రతో పాటు అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. మే 10 నుంచి 31వ తేదీ వరకు వరుసగా జరిగే కార్యక్రమాల షెడ్యూలుకు అనుగుణంగా భద్రతా ఏర్పాట్లు- చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రతి కార్యక్రమానికి ఒక నోడల్ ఆఫీసర్ ను నియమించాలని సూచించారు. మే 10వ తేదీన సాయంత్రం హైదరాబాద్ లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో మిస్ వరల్డ్ ప్రారంభోత్సవం నుంచి 31వ తేదీన జరిగే గ్రాండ్ ఫినాలే వరకు ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ లోని చార్మినార్, లాడ్ బజార్‌తో పాటు- తెలంగాణ తల్లి, సెక్రెటేరియట్ తోపాటు- రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించనున్న నేపథ్యంలో అవసరమైన రవాణా, వసతులు కల్పించాలన్నారు. అక్కడ భద్రత కట్టు-దిట్టంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనుకోని అవాంఛనీయ పరిస్థితులు తలెత్తినా వాటిని అధిగమించే ప్రత్యామ్నాయ ప్రణాళికలను అధికారులు రూపొందించుకోవాలని ఆదేశించారు. మహిళా సాధికారతను చాటిచెప్పేలా రాష్ట్రంలో ఐకేపీ మహిళలు నిర్వహిస్తున్న డ్వాక్రా బజార్ సందర్శనతో పాటు, ఉప్పల్ స్టేడియంలో ఐపీఎల్ సెమీఫైనల్స్ తిలకించేందుకు అవసరమైన ఏర్పాట్లు- చేయాలన్నారు. హైదరాబాద్ లో మిస్ వరల్డ్ కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాతావరణ సూచనలకు అనుగుణంగా తగిన ముందస్తు ఏర్పాట్లు- చేసుకోవాలని, ఈదురు గాలులు, వర్షాలు వచ్చినా గ్రేటర్ సిటీ- పరిధిలో ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీతో పాటు- హైడ్రా విభాగాలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మిస్ వరల్డ్ కు వచ్చే విదేశీ అతిథులు బస చేసే హోటళ్లతో పాటు- గచ్చిబౌలి స్టేడియం, చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలెస్, సెక్రెటేరియట్ పరిసర ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రజా ప్రతినిధులతో పాటు- వివిధ రంగాల్లో ప్రముఖులను ప్రభుత్వం తరఫున మిస్ వరల్డ్ 2025 ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ గురుకులాలు, బీసీ, ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా పాఠశాలలకు చెందిన విద్యార్థులను కూడా ఒకరోజు మిస్ వరల్డ్ వేడుకలు చూపించాలని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు- చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వేడుకలు జరిగే రోజుల్లో హైదరాబాద్ అంతటా మిస్ వరల్డ్ సందడి కనిపించేలా తోరణాలు, లైటింగ్, హోర్డింగ్ లతో పాటు- సిటీ-లోని ముఖ్యమైన జంక్షన్లు, చారిత్రక ప్రదేశాలను అందంగా అలంకరించాలని అన్నారు.

# ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

## -బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్



**నర్సంపేట/మే5(జర్నలిస్ట్ వార్త):** జనగణన దేశ అభివృద్ధికి మార్గదర్శిని, కులగణన ఆ అభివృద్ధిలో సమానతను తీసుకువచ్చే సాధనం బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్ అన్నారు. సోమవారం వరంగల్ రోడ్ సర్కిల్ లో గల అమరవీరుల స్థూపం దగ్గర నర్సంపేట పట్టణ బీజేపీ నాయకులతో కలిసి పాలభిషేకం చేశారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ ఉపాధ్యక్షులు రేసు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన జనగణనతో పాటు కులగణన చేపట్టడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు, జనగణన కులగణన సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ఎంతో ముఖ్యమైన విషయమని, 1872 ప్రారంభమైన ఈ కార్యక్రమం జనగణన అనేది ప్రతి 10 ఏళ్లకోసారి 15 సార్లు కొనసాగించారని, చివరిగా 2011 లో చేపట్టగా తరువాత కోవిడ్ కారణంగా ఆలస్యం జరిగిందని వెల్లడించారు, ఈ వివరాలు సేకరించడం ద్వారావెనుకబడిన అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం, రిజర్వేషన్ల విధానం, వనరుల పంపిణీ, విద్యా ,ఉద్యోగం మరియు ఎన్నో ఇతర ప్రయోజనాలు ఉన్నాయన్నారు, కులాల వాస్తవ జనాభా, ఆర్థిక పరిస్థితి, వారు ఏ ప్రదేశాలలో ఉన్నారో తెలుసుకుని, ప్రభుత్వ పథకాలను సమర్థంగా అమలు చేయవచ్చున్నారు, డిజిటల్ టెక్నాలజీ సహాయంతో డేటా సేకరణ చాలా సులువని, జనగణన ఒక దేశం అభివృద్ధికి మార్గదర్శిని అని అలాగే, కులగణన ఆ అభివృద్ధిలో సమానతను తీసుకువచ్చే సాధనమని అన్నారు, మనందరం ఇందులో భాగస్వాములవ్వాలని కోరారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వడ్డేపల్లి నరసింహారాములు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం ఆంజనేయులు, సీనియర్ నాయకులు ఠాకూర్ రవీందర్ సింగ్ (చిన్న), జిల్లా కౌన్సిల్ మెంబర్ పొదిళ్ల రామచందర్, రూరల్ మండల అధ్యక్షులు తనుగుల అంబేద్కర్ ,బిజెపి నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శులు కందికొండ శ్రీనివాస్, సూత్రపు సరిత, ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు, ఠాకూర్ విజయ్ సింగ్, కార్యదర్శులు చేను నరేష్, సామల ప్రవీణ్ కుమార్, సీనియర్ నాయకులు పొనుగోటి రవీంద్ర చారి, దుగ్యాల సమ్మయ్య, ఠాకూర్ శివాంజన్ సింగ్, నూనె రంజిత్, రూరల్ నాయకులు బట్టు మదన్, తాళ్లపల్లి రాము, బూసాని సుదర్శన్, యువ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్ ఉపాధ్యక్షులు కొంకిసా విగ్నేష్ గౌడ్, శ్రీనివాస్, కార్యదర్శి చిలువేరు అన్వేష్, నర్సంపేట యువ మోర్చా అధ్యక్షులు తప్పెట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# మధిర విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో భద్రతా వారోత్సవాలు






**మధిర/మే5(జర్నలిస్ట్ వార్త):** టీజీ ఎన్పీడీసీఎల్ కంపెనీ ఆదేశానుసారం మధిర సబ్ డివిజన్ స్థాయిలో పట్టణం లోని పివిఆర్ ఏసీ కళ్యాణమండపం లో మధిర సబ్ డివిజన్ ఏడిఈ యం. అనురాధ అధ్యక్షతన భద్రతా వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైరా డివిజన్ డిఈ బండి శ్రీనివాసరావు , సిబ్బందికి తగు సూచనలు తెలియజేస్తూ విద్యుత్ సరఫరా లో లోపాలు తలెత్తినప్పుడు, నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేటప్పుడు, ఇతర విద్యుత్తు మరమ్మతులు నిర్వర్తిస్తున్నప్పుడు విద్యుత్ శాఖ సిబ్బంది శాఖ పరంగా సూచించిన అన్ని భద్రత ఉపకరణాలు కచ్చితంగా ఉపయోగించి భద్రతా ప్రమాణాలు పాటిస్తూ విధులు నిర్వహించవలసిందిగా కోరారు. అదేవిధంగా వినియోగదారులు విద్యుత్ వాడకంలో ప్రమాదాలకు గురి కాకుండా తగు జాగ్రత్తలు పాటించే విధంగా సూచనలు చేయాలని సిబ్బందిని కోరారు. సబ్ డివిజన్ స్థాయిలో ఘనంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మధిర పట్టణం, మధిర రూరల్, మామునూరు, ఎర్రుపాలెం సెక్షన్ల ఏఈలు ఎస్. అనిల్ కుమార్, ఎస్. మైథిలి, వి. గణేష్, జి. అనూష లు పాల్గొని సిబ్బందికి తగు సూచనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు సెక్షన్ల పరిధిలోని విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నత్త నడక నడుస్తున్న సరస్వతి పుష్కరాల ఏర్పాట్ల పనులు

**ఏ ఒక్క పని పూర్తికాని వైనం చోటు చేసుకొందని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లిమల్లేష్..,**

**యు వై ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు అక్కల బాపు యాదవ్ అన్నారు. సోమవారం కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతి పుష్కరాల సందర్శనార్థం.**

**సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లిమల్లేష్..,**



భూపాలపల్లి/మే5(జర్నలిస్ట్ వార్త):
యు వై ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు అక్కల బాపు యాదవ్ కాళేశ్వరం లో సరస్వతీ పుష్కరాల కోసం ప్రభుత్వం 25 కోట్ల రూపాయల అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసింది ఈ రోజు పనులను సందర్శించడం జరిగింది మట్టి రోడ్డు బైపాస్ రోడ్డు నుండి విఐపి గాడ్ కు పోతుంది నాణ్యత లేకుండా పోస్తున్నారు వేగవంతంగా పనులు మాత్రం జరగడం లేదు గోదావరి ఒడ్డుకు బాత్రూములు నిర్మిస్తున్నారు అసంపూర్తిగా మధ్యలోనే ఉన్నవి పూర్తిస్థాయిలో నిర్మించిన దాఖలు కావడం లేదు కనీసం నీళ్లు పట్టడం లేదు కమాన్ కడుతున్నారు వేగవంతంగా కట్టడం లేదు కనీసం నీళ్లు పట్టడం లేదు బస్టాండ్ నుండి కమాన్ గుడి వరకు విద్యుత్ పోల్లు విద్యుత్ లైన్ ప్రాథమిక దశలో ఉన్నది పూర్తిస్థాయిలో పనులు మాత్రం జరగడం లేదు సరస్వతి విగ్రహం ఇప్పటివరకు పూర్తి స్థాయిలో నిర్మాణం జరగలేదు ఈనెల 15వ తేదీ లోపు పనులు మొత్తం పూర్తి చేసి ప్రజలకు సౌకర్యంగా పుష్కరాలకు అందే విధంగా చూడాలి కానీ పుష్కరాలు 10 రోజులు ప్రారంభం కానున్నాయి కానీ పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడ అన్నట్లు ఉన్నవి ఏ ఒక్క పని పూర్తిస్థాయిలో జరిగిన దాఖలు కానరావడం లేదు అధికారుల నిర్లక్ష్యం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం జోరుగా సాగుతోంది పర్సంటేజ్ ల కోసమే పనులు జరుగుతున్నాయా అభివృద్ధి కోసం జరుగుతుందా అనే ప్రశ్న ప్రజలు చర్చించుకుంటున్నారు వివిధ శాఖ అధికారులు పనులు ఎక్కడ వరకు వచ్చినవి అనే పర్యవేక్షణ లోపం ఉంది ప్రభుత్వ సొమ్ము ప్రజల సొమ్ము ఒక పైసా కూడా వృధా కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా కాళేశ్వరం అభివృద్ధి దేవాలయ అభివృద్ధి జరగవలసి ఉన్నది ఇప్పటివరకు ఒక్క సైడు కూడా మెట్లు పూర్తిగా ని పరిస్థితి



కనపడతా ఉంది తక్షణమే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని పనులను వేగవంతం చేయాలి పది రోజుల్లో పుష్కరాలకు అందుబాటులో ఉండే విధంగా కాంట్రాక్టర్స్ పని చేయాలి అని డిమాండ్ చేస్తా ఉన్నాం తక్షణమే జిల్లా కలెక్టర్ గారు పనులను సమీక్షించి వేగవంతం చేసే దిశగా తక్షణమే సందర్శించాలని ఎలాంటి అక్రమాలకు పాల్పడిన వారి పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తా ఉన్నాం పనులు వేగవంతం కాకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దయ్యం పోచయ్యరాజమణి తదితరులు పాల్గొన్నారు





# ఫ్రీ సమ్మర్ కరాటే క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలి

## -కరాటే మాస్టర్ పిచ్చయ్య



**సత్తుపల్లి/మే5(జర్నలిస్ట్ వార్త):**
ఫ్రీ సమ్మర్ కరాటే క్యాంప్ సద్వినియోగం చేసుకోవాలనికరాటే మాస్టర్ పిచ్చయ్య అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణం లో ఉన్న జేవీ ఆర్ డిగ్రీ కళాశాల గ్రౌండ్ లో మే 1 వ తారీఖు నుండి 31 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 5-30 గం నుండి ఉదయం 7గంటల వరకు ఉచితంగా కరాటే క్లాస్ లు నిర్వహిస్తునమన్నారు . ఈ సమ్మర్ క్యాంప్ లో అందరూ పిల్లలు పాల్గొనవచ్చు అన్నారు. కరాటే విద్య నేర్చుకోవడం వలన పిల్లల లో ఆత్మరక్షణ, ఏకాగ్రత,ఆత్మస్థయిర్యం వస్తుందని పిల్లల చురుకుగా ఉంటారన్నారు. ఈ నెల రోజుల క్యాంప్ కి హాజరు అయిన విద్యార్థులు కు కరాటే లో మెలుకువలు, ఎపెన్స్,డిఫెన్స్, కట్టా నేర్చుకుంటారు అని మంచిగా అన్ని నేర్చుకున్న పిల్లలకి సర్టిఫికెట్స్ ఇవ్వబడతాయి అని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ వేసవి కాలంలో సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నాం అని తెలిపారు. ఈ కరాటే వేసవి శిక్షణా లో ఆసక్తి ఉన్న ప్రతి విద్యార్థి పాల్గొనవచ్చు అన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పుట్టినరోజు వేడుకలు




**గణపురం/మే5(జర్నలిస్ట్ వార్త):** గణపురం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతే కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, నిండు నూరేళ్ళు ప్రజా సేవలో, ప్రజా క్షేత్రంలో ప్రజల పక్షాన పనిచేయాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ పోలసాని నరసింహా రావు, బీఆర్ఎస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు మేకల రజిత, నాయకులు బైరాగాని కుమారస్వామి, డాక్టర్ జన్నయ్య, మంద అశోక్ రెడ్డి, దాసరి రవి, బీఆర్ఎస్ యూత్ నాయకులు, ఆయా గ్రామాల గ్రామ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

## -జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే ఐపీఎస్




**భూపాలపల్లి/మే5(జర్నలిస్ట్ వార్త):** ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే ఐపీఎస్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా దివాస్ కార్యక్రమంలో బాగంగా ఎస్పీ వివిధ మండలాల నుంచి వచ్చిన బాధితుల నుంచి 16 పిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను ఓపికతో విని పరిష్కరించాలన్నారు. డ్రగ్స్,మత్తు పదార్థాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. బాధితుల సమస్యలు సత్వరంగా పరిష్కరించాలని సంబధిత పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

# రాష్ట్రం లో నివసిస్తున్న వలసదారులను వెనక్కి పంపాలి



**రాయపర్తి/మే5(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, రోహింగ్యా వలసదారులను వెనక్కి పంపాలని కోరుతూ బిజెపి నాయకులు సోమవారం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం శ్రీనివాస్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నూనె అనిల్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్, బంగ్లాదేశ్,రోహింగ్యా వలసదారులను వెనక్కి పంపించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో పాకిస్తాన్, బంగ్లాదేశ్,రోహింగ్యా దేశాలకు చెందిన వ్యక్తులు అక్రమంగా నివాసం ఉంటూ, పౌరసత్వం లేని పరిస్థితుల్లో అబద్ధ పత్రాలతో ప్రభుత్వ సేవలను పొందుతున్నారని మాకు సమాచారం అందిందని అన్నారు. ఇది రాష్ట్ర భద్రతకు ముప్పుగా మారే ప్రమాదం ఉందని అన్నారు. ఈవిధంగా విదేశీ జాతీయులు అక్రమంగా నివాసం ఉండటమే కాకుండా, కొన్ని చోట్ల అక్రమ కార్యకలాపాలలో కూడా పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇది స్థానిక ప్రజల భద్రతకు, సౌకర్యాలకు తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందని అన్నారు. అధికార పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉన్న ఈ విదేశీ అక్రమ వలసదారులపై వెంటనే విచారణ జరిపి, వారిని గుర్తించడముతోపాటు, కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి వారిని తక్షణమే వెనక్కి పంపించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ విన్నపించుకోవడం జరిగింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్ గౌడ్, యువమోర్చా జిల్లా అధికార ప్రతినిధి పెండ్యాల గణేష్ యువమోర్చా మండల అధ్యక్షులు మంచాల సుమన్ యాదవ్, మండల నాయకులు నిమ్మల అనిల్, మునావత్ బద్రు నాయక్,సోడియ సురేష్ నాయక్,యువ మోర్చా మండల కార్యదర్శిజక్కుల సందీప్ యాదవ్,నాయకులు నేతవత్ నరేష్,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తులకు తగు పరిష్కారం చూపాలి

**-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





**భూపాలపల్లి/మే5(జర్నలిస్ట్ వార్త):**ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల తగు పరిష్కారం త్వరగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజావాణిలో 52 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అట్టి సమస్యలు పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా, సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని దరఖాస్తులను ఆయా శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు తెలిపారు. ప్రజావాణి ప్రధాన ఉద్దేశం ప్రజల ఫిర్యాదులను స్వీకరించి త్వరితగతిన పరిష్కారం చేయడమేనని అధికారులు జాప్యం చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

**-20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి**

**-బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు**



**నర్సంపేట/మే5(జర్నలిస్ట్ వార్త):** దేశవ్యాప్తంగా ఉన్న అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని వారందరికీ లేబర్ శాఖ ద్వారా సంక్షేమ పథకాలు అందజేయాలని బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. సోమవారంఐస్ క్రీమ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం యూనియన్ అధ్యక్షుడు కొమురయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు మాట్లాడుతూ దేశంలో నాలుగున్నర కోట్ల మంది కార్మికులు రోజువారీగా పనులు చేసుకుంటూ కార్మిక చట్టాల అమలుకు దూరంగా ఉంటున్నారని వారందరికీ సంక్షేమ పథకాలు అందాలంటే పార్లమెంటులో సమగ్ర బిల్లు పెట్టి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల్లో మార్పులు తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడే విధంగా చట్ట సవరణలు చేయడాన్ని నిరసిస్తూ ఈనెల 20న దేశవ్యాప్తంగా అసంఘటిత కార్మికులు సమ్మె చేయబోతున్నారని ఆ సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారుసమావేశానంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అధ్యక్షులుగా చెరుపల్లి కొమరయ్య, కార్యదర్శిగా ఎండి అజీమ్, ఉపాధ్యక్షులుగా సలేంద్ర చేరాలు, కోశాధికారిగా గుండు స్వామి, కమిటీ సభ్యులుగా అన్నే బోయిన రాజు, జి సారయ్య, రాజు, మహేందర్ ,నరసయ్య ,శ్రీను బద్రు, పాషా, తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



**నర్సంపేట/మే5(జర్నలిస్ట్ వార్త):** ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన రెండు కోట్ల నలభై లక్షల విలువ గల కళ్యాణ లక్ష్మి,షాది ముభరక్ చెక్కులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి లబ్దిదారులకు సోమవారం కళ్యాణ లక్ష్మి,షాది ముభారక్ చెక్కులను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు రాజేష్,పనికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం




**రాయపర్తి/మే5(జర్నలిస్ట్ వార్త):** రాయపర్తి మండలం మైలారం గ్రామంలోని శ్రీ సాయి హై స్కూల్ 2004-2005 బ్యాచ్ కి చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం 20 సంవత్సరాల తరువాత కలుసుకొని ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు విద్య బుద్ధులు నేర్పిన ఆనాటి గురువులను రఘు,రవీందర్, వెంకట్ రెడ్డి,కుమార్,రామకృష్ణ చార్యులు, ఏలీయా,రవీందర్ లను ఘనంగా సన్మానించుకొని ఆశీర్వాదాలు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్దులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**





**భూపాలపల్లి/మే5(జర్నలిస్ట్ వార్త):** సరస్వతి పుష్కరాలు విజయవంతంగా నిర్వహించేందుకు కాళేశ్వరం లో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.సోమవారం కాళేశ్వరంలో విఐపి ఘాట్, సరస్వతి మాతా విగ్రహం ఏర్పాటు, శాశ్వత మరియు తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, టెంట్ సిటీ, ఫుడ్ కోర్టు, ఎగ్జిబిషన్, స్టాళ్ల ఏర్పాటు పనులను అధికారులతో కలిసి ఆయన పనులను పరిశీలించారు. ఈ నెల 15వ తేదీ నుండి 26వ తేదీ వరకు జరుగనున్న సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పనకు చేపట్టిన పనులు ఈ నెల 10 వ తేదీ వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రేపటి నుండి సరస్వతి తల్లి విగ్రహం ఏర్పాటు జరుగుతుందని తెలిపారు. విఐపి ఘాట్ వద్ద తోరణ నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. సరస్వతీ ఘాట్, గోదావరి ఘాట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. టెంట్ సిటీ, ఫుడ్ కోర్టు, ఎగ్జిబిషన్, స్టాళ్ల ఏర్పాటు పనులు ప్రారంభించాలని స్పష్టం చేశారు. మంచినీరు, భక్తులు బట్టలు మార్చు గదులు, గోదావరి హారతి పనులు టైం లో పూర్తి చేయాలని ఆదేశించారు. తాత్కాలిక రహదారి నిర్మాణం జరుగుతుందని, నీళ్లు, బుల్డోజర్ ద్వారా చదును చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పీఆర్, ఆర్ డబ్ల్యూఎస్, విద్యుత్, దేవాదాయ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, డిపిఓ వీరభద్రయ్య, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ఆర్టీసీ డిఎం ఇందు,తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపిడిఓ వెంకటేశ్వర్‌రావు, దేవాలయ ఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# జయముఖి ఇంజినీరింగ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

**-150 తాటిచెట్ల ధ్వంసం**

**-ఇంజనీరింగ్ కళాశాలపై ఎక్సైజ్ పోలీసులకు ఫిర్యాదు**

**-మోకుదెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్.**

**-మోకుదెబ్బ నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ గౌడ్**

**-చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గౌడ సంఘం సభ్యులు ఆందోళన**



**నర్సంపేట/మే5(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని మగ్దుంపురం గ్రామం శివారు జయముఖి ఇంజనీరింగ్ కాలేజ్ ఆవరణంలో వున్న తాటివనాన్ని అక్రమంగా కాల్చి ధ్వంసం చేసిన జయముఖి ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సోమవారం ముగ్దుపురం గౌడ పారిశ్రామిక సహకారం సంఘం అధ్యక్షుడు సతీష్ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ మేరకు కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గౌడ సంఘం ఆధ్వర్యంలో నర్సంపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు మాట్లాడుతూ జయముఖీ కళాశాల ఆవరణలో ఉన్న వందలాది తాటివనంలోని తాటిచెట్లను ఎన్నో సంవత్సరాలుగా కల్లు



గీసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. గౌడ సంఘానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వారికి ఇష్టంవచ్చినట్లు దౌర్జన్యంగా సుమారు 150పైగా పెద్ద పెద్ద తాటిచెట్లను,బొత్తలను జెసిబిలు , కూలీల సహాయంతో నరికించి దగ్ధం చేయించారని దీంతో నిరుపేదలమైన మాకు జీవనోపాధి కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొన్నది అవేదన వ్యక్తం



చేశారు.తాటిచెట్లను అక్రమంగా ధ్వంసం చేశారని కళాశాల యాజమాన్యాన్ని అడగగా మీరు ఏం చేసుకుంటారో చేసుకోండి అని దురుసుగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు గురిచేస్తున్నారని గౌడ సంఘం సభ్యులు ఆరోపించారు.కళాశాల యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఆర్థికంగా నష్టపోయి జీవనోపాధి కోల్పోయిన గౌడ కులస్తులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు కోరారు.

# రైతుల భూ సమస్యలను తీర్చడానికే భూ భారతి చట్టం

**- భూ భారతి చట్టంలోని అప్పీలు ద్వారా భూ సమస్యల పరిష్కారం**

**- బండౌతాపురం, కొత్తపల్లి గ్రామాల్లో రెవిన్యూ సదస్సులు**

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదాతో పాటు పాల్గొన్న వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**- ప్రజా ప్రభుత్వంలో ప్రజల వద్దకే పాలన**

**- రైతుల కోసం గ్రామాలకు తరలివచ్చిన అధికారులు**





వర్ధన్నపేట/మే 5(జర్నలిస్ట్): భూ భారతి నూతన రెవెన్యూ చట్టం అమల్లో భాగంగా వరంగల్ జిల్లాలోని వర్ధన్నపేట మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్ గా ఎంపిక చేసి, సోమవారం మండలంలోని బండవుతాపురం, కొత్తపల్లి గ్రామాల్లో జరిగిన రెవిన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే శ్రీ కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు భూ భారతి రెవెన్యు సదస్సులో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలను పరిశీలించి, రైతులు సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ ద్వారా అనేకమంది పేద రైతులు ఇబ్బందులకు గురయ్యారని వేల ఎకరాల భూములు గల్లంతయ్యాయని ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన భూభారతి చట్టం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు..గతంలో ఉన్న ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చేందుకు మేధావులు, రైతు సంఘాలు, అందరితో చర్చించి గత చట్టంలోని లోపాలను సవరిస్తూ కొత్త చట్టం భూ భారతిని తీసుకు వచ్చిందన్నారు. లోపభూయిష్టంగా ఉన్న ధరణి వల్ల పట్టా జారీలో ఏదేని పొరపాటు జరిగితే అప్పీలు చేయడానికి ఆవకాశం లేదని, రైతులు సివిల్ కోర్టు చుట్టూ తిరగాల్సి వచ్చేదని దానివల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారం లోకి వస్తే ధరణి స్థానంలో భూ భారతి తెస్తామని చెప్పిన ప్రకారం సీనియర్ అధికారులతో అన్ని రాష్ట్రాల్లో విచారణ చేసి సులువైన పటిష్టమైన చట్టాన్ని అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు. భూములు కొన్నా, అమ్మినా లైసెన్స్ సర్వేయర్ ద్వారా హద్దులతో మ్యాపు తయారు చేసి పట్టాదారు పాసు పుస్తకాల్లో నమోదు చేస్తారని తద్వారా భూమి గుర్తింపుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. తహసీల్దార్ ద్వారా ఏదేని పొరపాటు జరిగితే ఆర్డిఓ, ఆర్డిఓ నుండి కలెక్టర్, కలెక్టర్ నుండి భూ ట్రిబ్యునల్ నకు వెళ్ళడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సహాయ సేవలు అందించడానికి అవకాశం కల్పించారని అన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31వ తేదీన రికార్డుల నవీకరణలను చేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. ప్రజలకు ఆధార్ ఎలా ఉందో అలానే భూములకు భూదార్ జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్న వారికి దరఖాస్తులను పరిశీలించి వచ్చే నెల జూన్ 2 న పట్టా పాస్ పుస్తకాలను అందజేయనున్నట్లు ఎమ్మెల్యే నాగరాజు తెలిపారు. అలాగే మీకు ఏ సమస్య నా దయల్ యువర్ ఎమ్మెల్యే 8096107107 సమస్యలను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూలి జిల్లాలో భూ సమస్య లేని మండలం గా వర్ధన్నపేటను తీర్చిదిద్దాలని అధికారులకు పిలుపునిచ్చారు. వర్ధన్నపేట మండలంలోని 12 రెవిన్యూ గ్రామాల్లో ఈ నెల 5 నుంచి 14వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ మేరకు రెండు బృందాల ద్వారా సదస్సుల్లో రైతులు, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులు అనంతరం ఒక నెల సమయం లోపల భూ సమస్యలన్నీ భూభారత చట్టంతో పరిష్కరిస్తామన్నారు. భూ సమస్యల కోసం ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను అధికారులు, సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో వెళ్లి సమస్యను పరిష్కరిస్తారన్నారు. ఏలాంటి భూ సమస్యలైనా సత్వరమే పరిష్కరించాలన్నారు. రైతులు భూభారతి చట్టంలోని నియమాలన్నిటి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులు తీసుకోవడానికి రెవెన్యూ సదస్సులలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భూ భారతి చట్టంపై అవగాహన కల్పించి, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్దఅర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. దరఖాస్తులను వెంటవెంటనే పరిశీలిస్తూ, సత్వర పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తహసీల్దార్ దృష్టికి తెచ్చి అప్పటికప్పుడే పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్న రెవెన్యూ సదస్సులను వర్ధన్నపేట మండల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. పైలెట్ మండలంలో సదస్సులు పూర్తయ్యాక, జిల్లాలోని అన్ని మండలాల్లో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులు నిర్వహిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ ఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయసాగర్, మార్కెట్ ఛైర్మన్ వెంకటయ్య ప్రజా ప్రతినిధులు, రెవిన్యూ అధికారులు, రైతులు తదితరలు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాస పథకానికి సిబిల్ స్కోర్ తప్పనిసరి అనే నిబంధనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి.

-ఎలాంటి షరతులు లేకుండా అర్హులందరికీ రాజీవ్ యువ వికాస పథకాన్ని వర్తింపజేయాలి.

-మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సాదు నర్సింగరావు.



**చెన్నారావుపేట/మే5(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న పథకం రాజీవ్ యువ వికాస పథకం అని ఈ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతో ఉపయోగపడుతుందని భావించిన పథకానికి ప్రభుత్వం సిబిల్ స్కోర్ తప్పనిసరి అనే నిబంధన పేరుతో ఇట్టి పథకానికి తూట్లు పొడుస్తుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సాగునరసింగరావు అన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ గతంలో కార్పొరేషన్ ద్వారా లోన్లు తీసుకుని నిర్ణీత సమయంలో చెల్లించని వారికి ఈ పథకం వర్తింప చేయకపోవడం కరెక్టే అయినప్పటికీ లోన్లు తీసుకుని సకాలంలో చెల్లించిన వారికి ఈ పథకంలో చోటు కల్పించి అర్హులుగా గుర్తించాలన్నారు. పథకానికి సిబిల్ స్కోర్ ప్రామాణికంగా పెట్టడం వలన చాలామంది అనర్హులుగా మిగిలి అభివృద్ధికి నోచుకోకుండా పోతారని ఎందుకంటే కార్పొరేషన్ ద్వారా కాకుండా ప్రైవేట్ లోన్లు అనగా గోల్డ్ లోన్, గృహ రుణాలు, వాహన రుణాలు తీసుకొని సమయానికి చెల్లించకపోవడం వలన వారి సిబిల్ స్కోర్ పడిపోయే అవకాశం ఉంది కాబట్టి ఇలాంటి నిబంధన ప్రభుత్వం ఇట్టి పథకానికి అభియోగించడం సరైన నిర్ణయం కాదని ఈ నిర్ణయం ద్వారా ఎక్కువ శాతం మంది అనర్హులుగా మిగిలే అవకాశం ఉందని వెంటనే ఇట్టి నిర్ణయాన్ని ఉపసంహరించుకొని ఇట్టి పథకానికి అప్లికేషన్ పెట్టుకున్న నిరుపేద లబ్ధిదారుల అందరిని అర్హులుగా గుర్తించి ఇలాంటి షరతులు లేకుండా రాజీవ్ యువ వికాస పథకాన్ని వర్తింపజేసి వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి






**రాయపర్తి/మే5(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించే ఉచిత శిక్షణ శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,జిల్లా డిసిఇబి కార్యదర్శి గారె కృష్ణమూర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గేమ్స్ అండ్ స్పోర్ట్స్,స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్,క్రాఫ్ట్, కరాటే,కంప్యూటర్ అంశాలు తెలుసుకోవడం కోసం ఈ శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ సంవత్సరం ఆరవ తరగతిలో జాయిన్ అయ్యే విద్యార్థులతో పాటు 6 నుండి 9వ తరగతికి చదువుతున్న ప్రస్తుత విద్యార్థులు బడి ఈడు పిల్లలు శిక్షణ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవచ్చని అన్నారు.ప్రతి విద్యార్థి తల్లిదండ్రులకు తెలియపరచి పాఠశాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 11 గంటల వరకు పాఠశాలకు హాజరు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు జి సునీత, ఉపాధ్యాయులు ఉపేందర్,సురేందర్, కే శ్రీనివాస్,స్వామి,సంధ్య నరసింహులు,రాధా,సిఆర్ పి లు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మీ సీఎం రిలీఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే దొంతి





**చెన్నారావుపేట/మే5(జర్నలిస్ట్ వార్త):** కల్యాణ లక్ష్మీ సీఎం రిలీఫ్ చెక్కులను సోమవారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే దొంతి చేతుల మీదుగా అధికారులకు పంపిణిచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాట్లాడుతూ పేదింటి ఆడ పిల్లలకు పెళ్లి చేసిన అనంతరం తల్లిదండ్రులకు ఆర్థిక భారం ఉండకూడదని రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మీ ద్వారా పేదలను ఆదుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేసుకున్న పేద కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తుందని ఎమ్మెల్యే దొంతి అన్నారు.ఈ కార్యక్రమంలో వీరి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలయి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్,మాజీ ఎంపీపీ,జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్ రెడ్డి , మండల ఉపాధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధన రమేష్ లు మండల నాయకులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# సీఎంఆర్ఎఫ్ తో నిరుపేదలకు ఊరట



ఖమ్మం/మే5(జర్నలిస్ట్ వార్త): సీఎం రిలీఫ్ ఫండ్ తో నిరుపేదలకు ఎంతో ఊరట కలుగుతోందని, అనారోగ్యంతో సతమతమవుతూ వైద్యం చేయించుకోవటానికి ఇబ్బంది పడుతున్న ఎన్నో కుటుంబాలకు ఆర్థిక చేయూత కలుగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు మద్దినేని స్వర్ణ కుమారి పేర్కొన్నారు. సోమవారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ లబ్ధిదారుల చెక్కుల పంపిణీ కార్యక్రమం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో జరిగింది. 113మంది లబ్దిదారులకు సుమారు రూ. 40లక్షల విలువ చేసే చెక్కులను అందించారు. ఈ సందర్భంగా చెక్కుల పంపిణీ అనంతరం ఆయన మాట్లాడుతూ... మంత్రి పొంగులేటి సిఫారసుతో నియోజకవర్గానికి చెందిన అనేక మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు అనతి కాలంలోనే చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆయన నేతృత్వంలో పాలేరు నియోజకవర్గం కొత్త పుంతలు తొక్కుందని అభివర్ణించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు కావాల్సిన సౌకర్యాలను సమకూర్చేందుకు మంత్రి పొంగులేటి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఇప్పటికే దాదాపుగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుతో పాటు విద్యుత్ సమస్య లేకుండా చూడటం, చెక్ డ్యాంలను ఏర్పాటు చేయించడం మొదలగు అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు.

# పిల్లల్లో మానసిక,శారీరక వికాసం పెంపొందించేందుకు సమ్మర్ క్యాంపులు దోహదం చేస్తాయి. -ఎం ఈ ఓ సరళ

-క్రీడా, సాంస్కృతిక , విద్యాపర అంశాల్లో విద్యార్థులకు శిక్షణ:హెచ్ఎం జయ





**చెన్నారావుపేట/మే5(జర్నలిస్ట్ వార్త):** మొన్నటివరకు పుస్తకాలతో కుస్తీపట్టిన విద్యార్థులు ఇప్పుడు సెలవుల్లో ఆట,పాటలతో సరదాగా గడుపుటకు ఉచిత వేసవి శిబిరాలు ఎంతగానో దోహదం చేస్తాయని చెన్నారావుపేట మండల విద్యాశాఖ అధికారి శ్రీమతి బైరి సరళ తెలిపారు. సోమవారం నుండి చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణా శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ సరళ మాట్లాడుతూ పిల్లల్లో మానసికోల్లాసం, ఆటల్లో నైపుణ్యం కోసం సోమవారం నుంచి మొదలై 15 రోజులపాటు కొనసాగే ఉచిత వేసవి శిక్షణ శిబిరాలకు విద్యార్థులు ఉత్సాహంగా వచ్చి, హుషారుగా తర్ఫీదు



పొందాలని కోరారు.వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా, సాంస్కృతిక శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, శిబిరాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని, నలుగురు వాలంటీర్లను నియమించామని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ తెలిపారు.ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు ఆటలు, నృత్యం,చిత్రలేఖనం, క్రాఫ్ట్, స్పోకెన్ ఇంగ్లీష్ ,సైన్స్ ఎక్స్పరిమెంట్ మున్నగు అంశాలపై ఉచిత వేసవి శిబిరం 6 నుండి 9వ తరగతి చదివే విద్యార్థులకు నిర్వహిస్తామని, విద్యార్థులందరికీ పౌష్టికాహారమైన స్నాక్స్ అందజేస్తామని హెచ్ఎం జయ తెలిపారు. కళాజాత బృందం సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని రేకెత్తించారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, కలం ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు బాషా మియా, పరికి మధుకర్, ఉప్పరపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రెడ్డి,ఉపాధ్యాయులు సునీత, శశిధర్, మొగిలి, సతీష్ కుమార్, రమాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు స్వప్న, విద్యార్థుల తల్లిదండ్రులు, 6 నుండి 9వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్ డి ఎఫ్ ఆర్చరీ అకాడమీలో

# ఆర్చరీ వేసవి శిక్షణా శిబిరం

పర్వతగిరి/మే5(జర్నలిస్ట్ వార్త): ఆర్ డి ఎఫ్ ఆర్చరీ అకాడమీలో ఈనెల 10వ తారీఖు నుండి 30వ తారీఖు వరకు ఆర్చరీ వేసవి శిక్షణ కొనసాగుతుందని సోమవారం కళాశాల ప్రిన్సిపల్ ఆడెపు జనార్ధన్ తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థినీ విద్యార్థులకు విలువిద్య, యోగ, మెడిటేషన్, శారీరక మరియు మానసిక ఎదుగుదలకు కావలసిన శిక్షణ ఇవ్వబడును. శిక్షణ ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు మరియు సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు కొనసాగుననీ తెలిపారు. ఐదవ తరగతి నుండి ఇంటర్మీడియట్ చదువుతున్న ఆసక్తి గల విద్యార్థినీ విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని విలువిద్యలో శిక్షణ తీసుకోవాల్సిందిగా ఆయన కోరారు. సంప్రదించవలసిన నెంబర్ ఆర్చరీ కోచ్, రేణు మండల్ 78 38 613186, 9959301913.

# వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



**పర్వతగిరి/మే5(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రంలోని జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో సోమవారం వేసవి శిక్షణ శిబిరాన్ని మండల విద్యాశాఖ అధికారి గాయపు లింగారెడ్డి ప్రారంభించారు. 60 మంది హాజరైన విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వేసవి శిక్షణా తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 15 రోజులపాటు కొనసాగే శిక్షణా శిబిరంలో విద్యార్థులు.. ఆటపాటలే కాకుండా స్పోకెన్ ఇంగ్లీష్, క్రాఫ్ట్ ,సంగీతం వంటి తమకు నచ్చిన అంశంలో శిక్షణ పొందవచ్చునని, ఈ శిక్షణకు గాను నలుగురు వాలంటీర్లను నియమించడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు తెలిపారు. ప్రతిరోజు 8 గంటల నుండి 11 గంటల వరకు సాగే ఈ కార్యక్రమం అనంతరం విద్యార్థులకు స్నాక్స్ మరియు అరటి పళ్ళు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు కే శ్రీధర్, వాలంటీర్ ఉపాధ్యాయులు పి ఈ టి సురేష్, మహంకాళి రామస్వామి, తీగల సుప్రజ, గారే జయ రావు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ గోశాల గోవులకు 36 కట్టలు వరిగడ్డి అందజేత..

### దేవునిపల్లి గ్రామానికి చెందిన చేగురి భాస్కర్ గౌడ్...

**(షాద్ నగర్): మే5(జర్నలిస్ట్ వార్త):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్మున్సిపాలిటీ పరిధిలో సోలిపూర్ చౌడమ్మ గుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీకృష్ణ గోశాలలో గోవులకు సంరక్షణ కోసం మాజీ 6వ వార్డు కౌన్సిలర్ లతాశ్రీ శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో 36 కట్టలు వరిగడ్డి దానం చేయడం జరిగింది. అదేవిధంగా ప్రతిసారి అందిస్తామని వెల్లడించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,గో రక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.మా వంతుగా ఎల్లప్పుడూ దేవాలయంకు సహాయ సహకారాలు ఉంటాయని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మాజీ వార్డ్ సభ్యుడు సింగపాగ లక్ష్మయ్య,దేవాలయ కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ వలసదారులను గుర్తించండి

-అధికారులకు వినతి పత్రం అందించిన మండల , టౌన్ బిజెపి నాయకులు





**సత్తుపల్లి/మే5(జర్నలిస్ట్ వార్త):** అక్రమ వలసదారులను గుర్తించాలని టౌన్ బిజెపి నాయకులు బానోత్ విజయ్,సత్తుపల్లి మండల అధ్యక్షులు సాలి శివకృష్ణ అన్నారు. సోమవారం భారతీయ జనతా పార్టీ రాష్ట్ర జిల్లా పార్టీ ఆదేశాల మేరకు సత్తుపల్లి టౌన్ అధ్యక్షులు బానోత్ విజయ్ ,సత్తుపల్లి మండల అధ్యక్షులు సాలి శివకృష్ణ ఆధ్వర్యంలో సత్తుపల్లి తహసిల్దార్,సత్తుపల్లి సీఐ కి అక్రమ వలసదారుల విషయమై వినతి పత్రం అందించడం జరిగిందన్నారు. దేశంలో అక్రమ వలసదారులను గుర్తించి వారి వారి స్వదేశాలకు తిరిగి పంపుతున్న తరుణంలో, సత్తుపల్లి మండలంలో కూడా అనధికారికంగా నివసించే రోహింగ్యాలు, బంగ్లాదేశ్ పాకిస్తాన్ ల నుండి వలస వచ్చిన వారు ఉండే అవకాశం ఉందని, పోలీస్ మరియు రెవెన్యూ శాఖలు ప్రత్యేక దృష్టి సారించి కార్డెన్ సెర్చ్ లాంటివి నిర్వహించి సరైన పత్రాలు లేని అక్రమ వలసదారులను గుర్తించి తిరిగి వారిని వారి వారి దేశాలకు పంపించాలని దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఈ తరహా సెర్చ్ జరుగుతుందని. వేల సంఖ్యలో అక్రమ వలసదారులు బయటకు వస్తున్నారని స్థానికంగా కూడా ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ రెవెన్యూ, పోలీస్ శాఖకు ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించి అక్రమ వలసదారులను గుర్తించాలని వినతి పత్రం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూదన్ రావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జోనల్ గడ్డ నరేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆచంట నాగ స్వామి, షేక్ రహంతుల్లా,



పట్టణ అధ్యక్షులు బానోత్ విజయ్, ఏబీవీపీ నాయకులు మందా శివ, కార్తీక్ యాదవ్ ,యువ మోర్చా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయం లో సమీక్షా సమావేశం

## సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్





**సత్తుపల్లి/మే 5(జర్నలిస్టు వార్త):** ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయం లో సోమవారం సత్తుపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం తల్లాడ మండలం, కల్లూరు మండలం లో గ్రామ, గ్రామాన ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు పై వరి కొనుగోలు కేంద్రం, రేషన్ కార్డు లు, రేషన్ సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం, ఉపాధి హామీ కూలీలు గురించి వరి కొనుగోలు కేంద్రం సమావేశంలో చర్చించారుతల్లాడ మండలం, కల్లూరు మండలం లో ప్రభుత్వం రైతు ల నుండి వరి కొనుగోలు చేసిన, చేస్తున్న వివరాలు సంబంధిత అధికారులు ద్వారా వివరాలు తెలుసుకున్నారు. కొన్ని, కొన్ని చోట్ల రైతులు ఇబ్బంది పడుతున్న సంఘటనలు గురించి అధికారులు తో మాట్లాడారు అకాల వర్షాలు వస్తున్న నేపథ్యంలో వరి కొనుగోలు కేంద్రం లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలేత్తకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి అని, ఖమ్మం కలెక్టర్ తో రైతుల సమస్యలు గురించి మాట్లాడి ప్రభుత్వం ద్వారా పూర్తి సహకారం అందిస్తాము అని తెలిపారు. ధాన్యం కొనుగోలు రవాణా కు వెంటనే కాంట్రాక్టర్ తో మాట్లాడి ఇంకా లోడింగ్ కు లారీలు మాట్లాడాలి అని అధికారులు కు తెలిపారు..రేషన్ షాపులు ప్రతి రేషన్ షాప్ లో గతం లో మిగిలిన రేషన్ స్టాక్ బియ్యం వివరాలు సేకరించి వాటిని సంబంధిత అధికారులకు ఆ బియ్యం అందించాలి అని అధికారులకు తెలిపారు. గత నెల నుండి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో పేద ప్రజలు కోసం అందిస్తున్న సన్న బియ్యం ఒక్క గింజ కూడా దగా కాకూడదు అని, ప్రతి నేల రేషన్ డీలర్లు నుండి స్టాక్ వివరాలు సేకరించాలి అని అధికారులకు ఆదేశించారు.. ఎవరైనా రేషన్ డీలర్లు రేషన్ బియ్యం ను అమ్ముకున్నట్లు తెలిస్తే ఉపేక్షించిదే లేదు అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న రేషన్ కార్డ్ లు గురించి వాటి ద్వారా గత నెలలో లబ్ధిదారులు కు అందిన రేషన్ సన్న బియ్యం గురించి వివరాలు తెలుసుకున్నారు.. ప్రజా పాలనలో మరియు మీ సేవా సెంటర్ రేషన్ కార్డులు గురించి లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తు లు గురించి వివరాలు సేకరించారు... కొంతమంది అనర్హులు అని రేషన్ కార్డ్ నాన్ ఎలిజిబుల్ లిస్ట్ గురించి వివరాలు ఇవ్వాలి అని అధికారులు కు తెలిపారు.అనర్హులు లిస్ట్ కూడా మళ్ళీ పరిశీలించి అర్హత ఉంటే రేషన్ కార్డ్ లు ఇవ్వటం జరుగుతుంది అని ఎంఎల్ఏ తెలిపారు.. జూన్ 2 వ తారీకు రేషన్ కార్డ్ లను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వటం జరుగుతుంది అని ఎంఎల్ఏ తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద వాడి ఇంటి కళ నెరవేరుస్తుంది. అధికారులు లబ్ధిదారులకు అండగా ఉండండి. ప్రతి గ్రామంలో, పట్టణం లో ఇందిరమ్మ కమిటీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక మరియు నిర్మాణం జరుగుతుంది కావునా అధికారులు, ఇందిరమ్మ కమిటీ సమన్వయం తో కలిసి పని చెయ్యండి అని తెలిపిన ఎంఎల్ఏ. – రాజీవ్ యువ వికాస్ రాజీవ్ యువ వికాసం పథకం క్రింద తల్లాడ మండలం, కల్లూరు మండలం లో ఆన్లైన్ చేసుకున్న వారి వివరాలు తెలుసుకున్నారు. కార్పొరేషన్ ద్వారా ఎస్సీ ,ఎస్టీ,బీసీ, మైనారిటీ ఆన్లైన్ వివరాలు తెలుసుకొని, లబ్ధిదారులు ఎంపిక పూర్తి పారదర్శకంగా జరగాలి అని అధికారులకు ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస్ ద్వారా అందించనున్న ఆర్థిక సహకారం ద్వారా సత్తుపల్లి నియోజకవర్గం లో వేలాది మంది కుటుంబాల్లో ఆనందోత్సాహం. వారి సొంత కాళ్ళ మీద వాళ్ళు నిలబడి వ్యాపార రాబడి ప్రగతి సాదించాలి అని ముఖ్య మంత్రి శ్రీ రేవంత్ రెడ్డి లక్ష్యం అని ఎంఎల్ఏ తెలిపారు. ఉపాధి హామీ కూలీలు– గ్రామ, గ్రామాన పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలు వివరాలు తెలుసుకున్నారు.. ఉపాధి హామీ కూలీల ప్రస్తుత సమస్యలు గురించి అధికారులు తో చర్చించారు. పని సమయాల్లో కూలీలకు చేయవలిసిన ఏర్పాట్లు గురించి అధికారులకు తెలిపారు. త్రాగునిరు, ఫస్టెయిడ్ ,టెంట్ గురించి చర్చించి వాటిని పని ప్రదేశాల్లో ఏర్పాటు చెయ్యాలి అని ఎంఎల్ఏ తెలిపారు. పని చేసిన డబ్బులు బకాయిలు ఉంచకుండా డబ్బులు అకౌంట్ లో వేపించాలి అని తెలిపారు. గ్రామ అభివృద్ధి సమస్యలు– సెక్రటరీ లు గ్రామ అభివృద్ధి, సమస్యలు పైప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ అభివృద్ధి. లక్ష్యం కు సహకరించాలి అని గ్రామాల్లో నాయకులతో కలిసి పని చెయ్యాలి అని ఎంఎల్ఏ తెలిపారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన

## పొంగలేటి ప్రధాన అనుచరుడు నారపోగు వెంకట్

### -వివాహ వేడుకల్లో పాల్గొన్న గ్రామ పెద్దలు



**తల్లాడ/మే5(జర్నలిస్ట్ వార్త):** తల్లాడ మండల గొల్లగూడెం గ్రామానికి చెందిన తేలపుట వెంకటేశ్వర్లు, నాగేంద్ర ల కుమారుడు వరుడు ఏసోబు వధువు మౌనికల వివాహం వేడుక సోమవారం గొల్లగూడెం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొంగలేటి ప్రధాన అనుచరుడు మాజీ సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు నారపోగు వెంకట్ హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి దీవించారు.నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని,ఉన్నతమైన స్థితిలో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ పెద్దలు పాపారావు, పెద్ద జేమ్స్, వెంకటేశ్వర్లు, ఏసోబు, దావీదు, రాజశేఖర్ దేవదనం, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రోహింగ్యా లను గుర్తించి దేశం నుండి పంపించాలి





**సత్తుపల్లి/మే5(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నివాసం ఉంటున్న రోహింగ్యా లను గుర్తించి దేశం నుండి పంపించాలని పెనుబల్లి మండల శాఖ మండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు లు అన్నారు. సోమవారంభారతీయ జనతాపార్టీ పెనుబల్లి మండల శాఖ మండల అధ్యక్షులు బొర్రా నరసింహారావు అధ్యర్యంలో రాష్ట్ర పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షులు ఆదేశానుసారం మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నివాసం వుంటున్న రోహింగ్యాలను.. (పాకిస్తానీ బంగ్లాదేశ్ దేశస్తులు) లను గుర్తించి దేశ భద్రత దృష్ట్యా వారిని తక్షణమే దేశం విడిచి వెళ్లేలా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల తహసీల్దార్ కి, మరియు పోలీస్ అధికారి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి పడిగల మధుసూధన్, జిల్లా కౌన్సిలర్ ఓరుగంటి రాము, ఎస్సి మోర్చా మండల అద్యక్షులు పేర్ల మహేష్ , కోటా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులన్నీ వారం రోజుల్లో పూర్తి చేయాలి







**వర్ధన్నపేట/మే5(జర్నలిస్ట్ వార్త):** మహిళా సంఘాల ఆర్థిక సామాజిక అభివృద్ధి కోసం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) గ్రామైక్య సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను వివో ఏలు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తి చేయాలని డిఆర్డిఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు మునిగాల దయాకర్ అనితలు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో గ్రామైక్య సంఘాల సహాయకులకు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ మహిళా సంఘాల ఆర్థిక, సంక్షేమ అభివృద్ధి కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయకుండా జిల్లాలో వెనుకబడిన మండలాల జాబితాలో వర్ధన్నపేట మండలం ఉండడం అందుకు వివో ఏల అలసత్వమే కారణమని అన్నారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వివో పరిధిలోని పెండింగ్ పనులన్నీ వారం రోజుల్లో పూర్తి చేయాలని లేనిచో ఉపేక్షించేది లేదన్నారు. మహిళా స్వయం సహాయక బృందాలు క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకొని సమావేశంలోనే పుస్తక నిర్వహణ జరిపి వారి ఆర్థిక సామాజిక అభివృద్ధికి గ్రామైక్య సంఘాల సహాయకులే మూలాధారమని తెలిపారు. అలాంటి వ్యక్తులు సరిగా పనిచేయునప్పుడే స్వయం సహాయక సంఘాలు గాని గ్రామైక్య సంఘాలు గాని కుంటుపడతాయని తద్వారా సభ్యులలో ఐక్యత లోపిస్తుందన్నారు. వివో ఏలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలపై నిరంతరం సభ్యులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మండల సమైక్య ఆధ్వర్యంలో వివోఏలకు జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో బ్యాంకు లింకేజీ డిపిఎం అనిత ఏపిఎం ప్రేమ్ రాజు, వేణు ఐటి యాంకర్ పర్సన్ రవి కృష్ణ సీసీలు గోలి కొమురయ్య టి. రమేష్, స్వామి మండల సమైక్య అధ్యక్షురాలు అరుణ ఎమ్మెస్ ఏ రేవతి, వివో ఏలు కవిత జ్యోతి పద్మ రమ సుభద్ర హైమ అనిత శోభ స్రవంతి ఇందిరా మంజుల తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా నివాసం వుంటున్న రోహింగ్యాలను వెళ్లేలా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలి

### -భారతీయ జనతాపార్టీ తల్లాడ మండల శాఖ మండల అధ్యక్షులు చల్లా నాగులు





తల్లాడ/మే5(జర్నలిస్ట్ వార్త):అక్రమంగా నివాసం వుంటున్న రోహింగ్యాలను వెళ్లేలా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతాపార్టీ తల్లాడ మండల శాఖ మండల అధ్యక్షులు చల్లా నాగులు అన్నారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర పార్టీ, జిల్లా పార్టీ అధ్యక్షులు వారి ఆదేశానుసారం మండల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నివాసం వుంటున్న రోహింగ్యాలను (పాకిస్తానీ బంగ్లాదేశ్ దేశస్తులు) లను గుర్తించి దేశ భద్రత దృష్ట్యా వారిని తక్షణమే దేశం విడిచి వెళ్లేలా చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ తల్లాడ మండలం తహసీల్దార్ కి, పోలీస్ అధికారి కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రాయల రమేష్ గొల్లమందల్ నరేష్ సంగీతం సాయి చంద్ చల్ల రాము పులి వెంకటేశ్వర్లు రామారావు మలేడు వెంకటయ్య వేము అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# గోపనపల్లి లో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కమిటీ ఏర్పాటు





**పర్వతగిరి/మే5(జర్నలిస్ట్ వార్త):** గోపనపల్లి గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహస్కరణ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు. చైర్మన్ గా జన్ను నరసయ్య వైస్ చైర్మన్గా ,మంద రాజేందర్, అధ్యక్షులు గా మంద రవీందర్, ఉపాధ్యక్షులు, బాష్పాక నరసయ్య,నరుకుడు నవీన్, కొండేటి కుమార్ స్వామి, కార్యదర్శులు జన్ను రాజు,మంద రవి, మంద దేవేందర్,సభ్యులు మంద కనకయ్య, భాష్పాక రాజు, మంద దేవదాస్, మంద రాజబాబు, జన్ను మధుమోహన్, జన్ను బిక్షపతి, జన్ను సతీష్, నరుకుడు మధు, బాష్పాక దేవేందర్, లను నియమించ బడ్డారు.

# చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు.

### - జిల్లా అకాడమిక్ కో-ఆర్డినేటర్ సృజన్ తేజ

**వర్ధన్నపేట/మే5(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగాలంటే విలువలతో కూడిన చదువులు చదివితేనే ముందుకు వెళ్తారని జిల్లా అకాడమిక్ కో–ఆర్డినేటర్ సృజన్ తేజ పేర్కొన్నారు. సోమవారం వర్ధన్నపేట ప్రభుత్వ ఉన్న పాఠశాలలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆట పాటలు, కథలు, వివిధ క్రీడల్లో నైపుణ్యం సాధించాలని, అప్పుడే సమాజంలో పేరు ప్రతిష్టలు దక్కుతాయన్నారు. విద్యార్థులకు 15రోజుల పాటు వేసవి శిక్షణలు ఉంటాయన్నారు. శిక్షణలో భాగంగా ఉపన్యాస, వ్యాసరచన పోటీలలో పాల్గొనేలా శిక్షణ ఇస్తామన్నారు. ప్రతి రోజు ఉదయం 8గంటల నుండి 11గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా తీసుకున్న ఈ వేసవి శిక్షణ తరగతులు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశరదదేవి ఆదేశాలమేరకు డిఈఓ మామిడి జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో 100 కు పైబడి విద్యార్థుల సంఖ్య గల 50 పాఠశాలలో ప్రారంభించ బడుతున్నవని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సీనియర్ ఉపాధ్యాయుని సహకారంతో 15 రోజు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మండల విద్యాధికారి మామనూరి శ్రీధర్ మాట్లాడుతూ శిక్షణ కేంద్రం లో 100 మంది విద్యార్థుల వరకు శిక్షణ ఇవ్వనున్నామని తెలియజే



శారు. మండలములోని కట్రియాల, ఇల్లంద పాఠశాలలో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ డాన్స్, ఆటలు, చిత్రలేఖనం, కరాటే, క్రాఫ్ట్ , స్పోకెన్ ఇంగ్లీష్ వంటి అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం 11గంటలకు విద్యార్థులకు స్నాక్సును అందించి ఇంటికి పంపిస్తామని తెలిపారు. వర్ధన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ లక్ష్మీబాయి, ఉపాధ్యాయులు పర్వత రమణ రావు, ఎన్సిసి ఫీసర్ నిమ్మ మనుజేందర్ రెడ్డి, మైదం అశోక్, పల్లె మదన్ మోహన్, బరిగల దేవయ్య, లలిత్ కుమార్, రోహిణి దేవి, సునీత, జి కుమారస్వామి, మంజు సుప్రియ, మెంతం







జయంజలి, అరవింద్ , సుధారాణి, స్వర్ణ, కుమారి రేఖ తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు మత్స్యకారులకు రక్షణ ఇవ్వాలి

## ఇరు దేశాలు ఈ సమస్యపై పరస్పరం చర్చించాలి -ఎక్స్‌లో పోస్ట్ చేసిన డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



అమరావతిమే5(జర్నలిస్ట్ వార్త):భారత మత్స్యకారుల విషయంలో శ్రీలంక ఉదారంగా ఉండాలని, సమస్యలు ఉంటే ఇరు దేశాలు కలిసి చర్చించాలని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఇటీవల బంగాళాఖాతంలో జరిగిన ఐదు వేర్వేరు సంఘటనలలో తమిళనాడుకు చెందిన 24 మంది భారతీయ మత్స్యకారులకు సంబంధించిన సంఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. భారతదేశం, శ్రీలంక ప్రభుత్వాలు పరస్పర సహకార స్ఫూర్తితో ఈ సమస్యలను పరిష్కరించడానికి నిర్మాణాత్మక చర్చలు చేయడం అత్యవసరమని భావిస్తున్నట్లు- డిప్యూటీ-సీఎం అన్నారు. ఇరువైపులా మత్స్యకారుల భద్రత, గౌరవాన్ని నిలబెట్టడానికి నిరంతర ప్రయత్నాలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. నాగపట్నం జిల్లాకు చెందిన ఈ మత్స్యకారులు సముద్రంలో జరిగిన ఘర్షణల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, గాయపడ్డారని తెలుసుకోవడం బాధాకరం, భారతదేశం.. శ్రీలంక మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా, పునరావృతమయ్యే ఈ సంఘటనలను గమనించి, ఈ పునరావృత పరిస్థితులను స్నేహపూర్వకంగా పరిష్కరించాలని విదేశాంగ మంత్రిత్వ శాఖను కోరుతున్నానని పోస్టు చేశారు. కాగా రాజధాని అమరావతి ప్రపంచస్థాయి, సర్వశ్రేష్ఠ రాజధానిగా నిలుస్తుంది. కేవలం ఆర్కిటెక్చర్, కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా... జవాబుదారీతనానికి, న్యాయానికి, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీ కలిసి అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతారు. మన యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... అమరావతే అవకాశాల రాజధానిగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు, జగన్ హయాంలో వారు ఎదుర్కొన్న కష్టాలను ప్రస్తావిస్తూ ఉద్వేగంగా ప్రసంగించారు. అప్పట్లో దివి సీమ తుఫాను వచ్చి అందరి ఆశలు తుడిచిపెట్టినట్లు-... గత ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు, అమరావతి భవిష్యత్తును తుడిచిపెట్టింది. అమరావతి అంటే పరదాలు, సెక్షన్ 30, సెక్షన్ 144 మాత్రమే గుర్తుకు వచ్చేలా చేసింది. రాజధాని కోసం 34వేల ఎకరాలు ఇచ్చిన 29వేల పైచిలుకు రైతులు గత ఐదేళ్లు నలిగిపోయారు. రోడ్ల మీదకు వచ్చారు. ముళ్ల కంచెల మధ్య కూర్చున్నారు. లాఠీ దెబ్బలు తిన్నారు. కేసులు ఎదుర్కొన్నారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి సమయంలో... తమ కన్నీళ్లు తుడిచే వారు ఉన్నారా... మా కష్టాలు ప్రధాని మోదీకి తెలుస్తాయా అని నన్ను అప్పట్లో అడిగారు. మోదీకి తెలియకుండా ఏదీ ఉండదు... అమరావతే శాశ్వత రాజధానిగా ఉంటు-ందని ఆనాడే మాట ఇచ్చాం. గత ప్రభుత్వం ఈ త్యాగాన్ని అవమానించిందని పవన్ కల్యాణ్ అన్నారు.

# వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం..!

## అకాల వర్షాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

- పిడుగుపాటు బాధిత కుటుంబాలకూ
- వెంటనే నష్టాన్ని అంచనా వేయండి
- పలు జిల్లాలకు ఇంకా వర్షసూచన
- ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు
- అధికారులు మానవత్వంతో వ్యవహరించాలి
- సాంకేతికతతో ముందస్తు సూచనలు
- ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందే



అమరావతి,మే5(జర్నలిస్ట్ వార్త):
అకాల వర్షాలు, ఈదురు గాలులు, వడగళ్లతో పంట నష్టపోయిన రైతులకు మంగళవారం సాయంత్రంలోగా పరిహారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పంట నష్టాన్ని వెంటనే అంచనా వేసి, నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చూడాలని స్పష్టం చేశారు. పిడుగుపాటు కారణంగా చనిపోయిన 10 మంది బాధితుల కుటుంబాలకు కూడా తక్షణమే పరిహారం అందించాలన్నారు. రాష్ట్రంలో గత రెండురోజులు కురిసిన అకాలవర్షాలపై సోమవారం అమరావతి సచివాలయంలో వ్యవసాయ, ఉద్యాన, విపత్తుల నిర్వహణ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో పంట, ప్రాణ నష్టం గురించి అధికారులను అడిగి సీఎం వివరాలు తెలుసుకున్నారు. జిల్లాల్లో పరిస్థితులను కలెక్టర్లు వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఇంకా వర్షసూచన ఉన్నందున కలెక్టర్లు, అధికారులు ప్రజల్ని అప్రమత్తం చేయాలని, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిడుగులు పడే సమయాల్లో ప్రజల సెల్ ఫోన్లకు హెచ్చరిక సందేశాలు పంపాలన్నారు. సందేశం వెళ్లని పరిస్థితుల్లో దగ్గరగా ఉన్న అధికారులు వెళ్లి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. విపత్తుల సమయాల్లో అధికారులు మానవత్వంతో వ్యవహరించాలన్నారు. పిడుగులు పడి చనిపోయిన పశువులకు కూడా నిబంధనల మేరకు పరిహారం వెంటనే విడుదల చేయాలని ఆదేశించారు. ప్రాథమిక అంచనా ప్రకారం వర్షాలతో రాష్ట్రంలో 2,224హెక్టార్లలో వరి, మొక్కజొన్న దెబ్బతిన్నట్లు అధికారులు సీఎంకు వివరించారుపశ్చిమగోదావరి జిల్లాలో 15 మండలాల్లో 1,033 హెక్టార్లు, నంద్యాల జిల్లాలో 641, కాకినాడ జిల్లాలో 530, శ్రీసత్యసాయి జిల్లాలో 20 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. అలాగే అరటి, బొప్పాయి, మామిడి, తదితర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. కృష్ణా, ఏలూరు, కాకినాడ, ఎన్టీఆర్, తిరుపతి, నంద్యాల, పశ్చిమగోదావరి జిల్లాల్లో మొత్తం 138 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు వివరించారు. పిడుగుపాటుకు తిరుపతి జిల్లాలో నలుగురు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఇద్దరు చొప్పున, ఏలూరు, నెల్లూరు జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు చెప్పారు.రబీ సీజన్‌లో 30లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పౌర సరఫరాల శాఖ ప్రత్యేక కార్యదర్శి సౌరబ్‌గౌర్ సీఎంకు వివరించారు. ఇప్పటికే 13లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. వర్షాలకు రంగు మారిన ధాన్యం కొనుగోలుకు కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై చంద్రబాబు మాట్లాడుతూ.. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయాల్సిందేనని గట్టిగా చెప్పారు. అవసరమైతే కేంద్రంతో మాట్లాడి కొనుగోలుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏ ఒక్క రైతు నుంచి కూడా ధాన్యం కొనలేదన్న మాట రాకూడదని స్పష్టం చేశారు. కాగా, రాబోయే రోజుల్లో కూడా ఆర్టీజీఎసలోని అవేర్ విభాగం, విపత్తు నిర్వహణ సంస్థ నుంచి ఎప్పటికప్పుడు వాతావరణంపై ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తుంటామని చెప్పారు. కలెక్టర్లందరూ ఇందుకు అనుగుణంగా ఆయా జిల్లాల్లో విపత్తు మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రభుత్వం వద్ద మంచి యంత్రాంగం, సాంకేతికత ఉందని, వీటిని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. వర్షాలకు పలు జిల్లాల్లో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించడంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చేసిన కృషిని సీఎం అభినందించారు.అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పంట నష్టపోయిన రైతులకు రానున్న రోజుల్లో ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా తగిన సూచనలు ఇవ్వాలన్నారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు.

# అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు విస్తరణ

## ప్రతి అర్హులైన రైతు కుటుంబానికి రూ.20,000 ఆర్థిక సాయం

## మూడు విడతల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ



అమరావతి,, మే5(జర్నలిస్ట్ వార్త):
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల సంక్షేమం దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో భూ యాజమాన్య హక్కు లేకున్నా, ఇతరుల భూములను కౌలుకు తీసుకుని సేద్యం చేస్తున్న కౌలు రైతులకు కూడా ఆర్థిక భరోసా కల్పించాలని సంకల్పించింది. ఇప్పటికే అమలులో ఉన్న 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని కౌలు రైతులకు సైతం వర్తింపజేస్తున్నట్లు ప్రకటించింది. ఈ పథకం కింద అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏటా రూ. 20,000 ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది.

ఈ మొత్తాన్ని మూడు విడతలుగా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద అందించే రూ. 6 వేలతో కలిపి ఈ మొత్తం రూ. 20,000 అందజేయనున్నారు. ఈ పథకం కింద అటవీ భూములపై హక్కు పత్రాలు (ఆర్ఓఎఫ్ఆర్) కలిగిన రైతులను కూడా అర్హులుగా గుర్తించనున్నారు.

ఈ పథకం అమలు కోసం క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖల సహాయకులు, తహసీల్దార్లు, మండల వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని కౌలు రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ రైతుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హుల జాబితాలను సిద్ధం చేయాలని సూచించింది. ఇలా ధ్రువీకరించిన జాబితాలను మే 20వ తేదీలోగా 'అన్నదాత సుఖీభవ' అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని స్పష్టం చేసింది.ఈ పథకం అమలులో కుటుంబాన్ని (భర్త, భార్య, మైనర్ పిల్లలు) ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. కుటుంబంలోని పిల్లలకు వివాహమైతే వారిని ప్రత్యేక యూనిట్‌గా గుర్తిస్తారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు, పట్టు పరిశ్రమకు సంబంధించిన పంటలు సాగు చేసే వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది.

అయితే, ఈ పథకానికి కొన్ని వర్గాలను మినహాయిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్నవారు, గతంలో లేదా ప్రస్తుతం రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు, ఇంజనీర్లు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్టులు వంటి వృత్తి నిపుణులు, గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను చెల్లించిన వారు ఈ పథకానికి అర్హులు కారని ప్రభుత్వం తేల్చి చెప్పింది.

# దెబ్బతిన్న పంటలను పరిశీలించండి

## రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి

## వైకాపా శ్రేణులకు జగన్ సూచన



అమరావతి, , మే5(జర్నలిస్ట్ వార్త):
:రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి.. చేతికి వచ్చిన ఎన్నో పంటలు దెబ్బతినడంతో.. రైతులు గగ్గోలు పెడుతున్నారు.. ఈ క్రమంలో రీజినల్ కో-ఆర్డినేటర్లు, పార్టీ ముఖ్య నేతలతో భారీ వర్షాలపై మాజీ సీఎం వైఎస్ జగన్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.. ఈ సందర్భంగా పార్టీ నేతలకు కీలక ఆదేశాలు జారీ చేశారు.. అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా రాష్ట్రంలో పలుచోట్ల ధాన్యం తడిసిపోవడంతో పాటు అనేక ఉద్యానవన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అకాల వర్షాలు, ఈదురుగాలుల కారణంగా నష్టపోయిన రైతులను పరామర్శించాలని స్పష్టం చేశారు..ఇక, రైతులను ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వైసీపీ నేతలకు సూచించారు. కష్టకాలంలో ఉన్న రైతులకు అండగా నిలవాలి. వర్షాలు కురుస్తాయన్న సమాచారం ముందస్తుగానే ఉన్నప్పటికీ కల్లాల్లో పొలాల్లో రైతుల వద్దనున్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో తీవ్ర నిర్లక్ష్యం కనిపించిందని విమర్శించారు.. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం నిస్తేజంలో ఉంది . ఖరీఫ్‌లో ప్రతికూల వాతావరణం, కనీస మద్దతు ధరలు లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రబీ సీజన్‌లో కూడా కష్టాలు పడుతున్నారని తెలిపారు.. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు సహా పలు చోట్ల ప్రభుత్వం ధాన్యాన్ని సరిగ్గా సేకరించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు

# వర్రా అరెస్ట్‌పై తప్పుడు అఫిడవిట్లు

## పోలీసులకు హైకోర్టు అక్షింతలు



విజయవాడ, మే5(జర్నలిస్ట్ వార్త):
పోలీస్ అధికారులపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సోషల్ మీడియా యాక్టివిస్ట్ వర్రా రవీందర్‌రెడ్డి కేసులో అరెస్ట్ సమయం, తేదీపై తప్పుడు అఫిడవిట్లు ఇచ్చారని ఫైరయ్యింది. సీసీ ఫుటేజ్ ఆధారంగా పోలీసులు వేసిన అఫిడవిట్లలో సమాచారం తప్పని హైకోర్టు తేల్చింది. 2024 నవంబర్ 8న అరెస్ట్ చేసి 10న చేశామని ఎలా చెప్తారని ప్రశ్నించింది. తాము తీసుకోబోయే చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలని హైకోర్టు సూచించింది. సోషల్ మీడియాలో తమకు వ్యతిరేకంగా పోస్టులు పెట్టారని కూటమి ప్రభుత్వం గతేడాది నవంబర్‌లో వైఎస్సార్ జిల్లాకు చెందిన వర్రా రవీంద్రారెడ్డిపై అక్రమ కేసులు బనాయించింది. పులివెందుల అర్బన్ పోలీసుస్టేషన్‌లో పుల్లప్పగారి హరి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. రవీంద్రారెడ్డితో పాటు- అతడికి ఆశ్రయం కల్పించిన కమలాపురం మండలం నల్లింగాయపల్లెకు చెందిన గుర్రంపాటి సుబ్బారెడ్డి అలియాస్ సుబ్బారెడ్డి, ఎర్రగుంట్ల మండలం సున్నపురాళ్లపల్లెకు చెందిన గురజాల ఉదయ్‌కుమార్‌రెడ్డిలు కూడా కారులో ఉండటాన్ని గుర్తించి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే,ఈ అక్రమ కేసులపై విచారణ చేపట్టిన ఏపీ హైకోర్టు ఈ ఏడాది మార్చి నెలలో వర్రా రవీంద్రారెడ్డికి పలు కేసుల్లో బెయిల్ మంజూరు చేసింది.

# రాయలసీమ గడ్డ...నా అడ్డా

## మా జోలికి వస్తూ ఊరుకునేది లేదు -పలు అభివృద్ధి పనులు చేపట్టిన బాలకృష్ణ



శ్రీ సత్యసాయి జిల్లా, మే5(జర్నలిస్ట్ వార్త):
రాయలసీమ గడ్డ తన అడ్డా అని వైసీపీ నేతలకు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ గట్టి వార్నింగ్ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ వైసీపీ నేతలను బాలకృష్ణ హెచ్చరించారు. సోమవారం హిందూపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హిందూపురం మండలం ఇందిరమ్మ కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మీడియాతో మాట్లాడారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు హిందూపురం అంటే రెండో పుట్టినిల్లుగా భావించేవారని నందమూరి బాలకృష్ణ అన్నారు. టీడీపీ అంటే ఒక జవాబుదారి పార్టీగా పేరుగాంచిందని చెప్పారు. ఏపీ సీఎం చంద్రబాబు ఒక విజనరీ ఉన్న లీడర్ అని కొనియాడారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే హిందూపురంలో రూ. 50 కోట్ల నిధులతో పనులు చేయించానని గుర్తుచేశారు. హిందూపురంలో శాశ్వత తాగునీటి పథకానికి రూ. 136 కోట్ల నివేదికలు సిద్ధం చేశామని అన్నారు. మున్సిపాలిటీలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరుస్తామని తెలిపారు. 1984లోనే ఎన్టీఆర్ తూముకుంట వద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటు- చేయడం.. హిందూపురం ప్రజలు మర్చిపోలేనిదని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. పలు అభివృద్ధి కార్యక్రకమాల్లో మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి పాల్గొన్న బాలకృష్ణ.. టేకులోడులోని ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు.. ఇందిరమ్మ కాలనీలో గతంలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్వాధీన పత్రాలను మంత్రి అనగానితో కలిసి పంపిణీ చేశారు.. మొత్తం 237 మంది లబ్దిదారులకు స్వాధీన పత్రాలు అందజేశారు.. ఇక, ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ.. టీ-డీపీ కార్యకర్తల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. రాయలసీమ గడ్డ.. నా అడ్డా.. అని పేర్కొన్నారు..

# పెన్షన్ల పంపిణీలో అన్ని జాగ్రత్తలు: మంత్రి



అమరావతి, , మే5(జర్నలిస్ట్ వార్త): పింఛను పంపిణీలో అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు- ఏపీ సమాచారశాఖ మంత్రి పార్థసారథి తెలిపారు. లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛను అందించే బాధ్యత అధికారులదేనని చెప్పారు. అమరావతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల పంపిణీలో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. అకాల వర్షాలు, పంట నష్టంపై సీఎం సమీక్ష నిర్వహించారని, కొన్ని చోట్ల ధాన్యం తడిసినట్లు- కలెక్టర్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. రంగు మారిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఏ రైతూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ధాన్యం ఎలా ఉన్నా ప్రభుత్వమే వాటిని కొనుగోలు చేస్తుంది. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని పార్థసారథి తెలిపారు.

జర్నలిస్ట్ వార్త

మంగళవారం 6 మే 2025

# హరిహర వీరమల్లు షూటింగ్ బిజీలో పవన్ కళ్యాణ్



హరి హర వీరమల్లు'ను ముగించేందుకు కథానాయకుడు పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. ఆయన -టైటిల్ పాత్రలో నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రం ఇప్పటికే ముగింపు దశకు చేరుకోగా.. ఆఖరి షెడ్యూల్ కోసం పవన్ ఆదివారం సెట్లోకి అడుగు పెట్టారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సిద్ధం చేసిన సెట్లో దర్శకుడు జ్యోతికృష్ణ నేతృత్వంలో రెండు రోజుల పాటు- ఈ చిత్రీకరణ కొనసాగనుంది. దీనిలో భాగంగా పవన్‌పై కీలక సన్నివేశాలు చిత్రీకరించి.. 6వ తేదీతో సినిమాకి గుమ్మడికాయ కొట్టనున్నారు. ఆ వెంటనే చిత్రబృందం కొత్త విడుదల తేదీని అధికారికంగా ప్రకటించనుంది. 17వ శతాబ్దం నాటి మొఘల్ సామ్రాజ్యం నేపథ్యంలో జరిగే ఆసక్తికర కథాంశంతో రూపొందుతున్న చిత్రమిది. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. తొలి భాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది. ఇందులో నిధి అగర్వాల్ (కఠ ఆగశసూశ) కథానాయికగా నటిస్తుండగా.. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి దర్శకత్వం: క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, ఛాయాగ్రహణం: మనోజ్ పరమహంస, జ్ఞానశేఖర్ వీఎస్. నిర్మాత: ఎ.దయాకర్ రావు, సమర్పణ: ఎ.ఎం.రత్నం.

# బన్నీ-అట్లీ సినిమాపై పెరుగుతున్న అంచనాలు




పాన్ ఇండియా లెవెల్ లో తెలుగు హీరోలు తీస్తున్న సినిమాలు చిత్రసీమను షేక్ చేస్తున్నాయి. హాలీవుడ్ లెవెల్ యాక్షన్ హంగులు ఉన్న భారీ సెట్టింగ్స్, ఇలా ఎన్నెన్నో సినిమాలు ఇండియన్ సినిమా దగ్గర నుంచి వస్తున్నాయి. ఇక అలా ఇండియన్ సినిమా నుంచి రీసెంట్‌గా ఇంటర్నేషనల్ లెవెల్లో అనౌన్స్ అయిన సినిమా ఏదైనా ఉంది అంటే.. అది ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్‌లో వస్తున్న మూవీ అని చెప్పవచ్చు. కాగా ఈ చిత్రం అనౌన్స్ చేసినపుడే అందులో విజువల్స్ చూసి హాలీవుడ్ లెవల్లో ప్లాన్ చేస్తున్నట్టు- అర్థం అవుతుంది. అయితే ఈ మూవీలో బన్ని మొత్తం మూడు పాత్రలు పోషించననున్నాని తెలుస్తోంది. ఇందుకోసం చాలా కసరత్తులు చేస్తున్నాడట. ఇక ఈ సినిమాతో విజువల్ ఎఫెక్ట్స్ పరంగా ఆడియెన్స్‌ని ఖచ్చితంగా మరో లోకం లోకి తీసుకెళ్ళడానికి బన్నీ ఇంకా అట్లీ- ఇద్దరు గట్టిగా ప్లాన్ చేస్తున్నారట. ఇదిలా ఉంటే ఈ రెంజ్ మూవీ కోసం యాక్టర్స్‌ని ఎంచుకోవడం ఒక్కింత కష్టం అనే చెప్పాలి. ఎందుకంటే ప్రతి ఒక్క పాత్ర చాలా ముఖ్యం. అందుకే ఇప్పటిక వరకు ఈ మూవీలో నటనటు-ల గురించి ఎలాంటి అప్ డేట్‌లు రావడంలేదు. కానీ తాజాగా ఈ సినిమాలో ఓ స్పెషల్ రోల్‌ను డిజైన్ చేస్తున్నట్లు- తెలుస్తోంది. ఈ పాత్రలో ఓ బాలీవుడ్ హీరోని తీసుకునే ఆలోచనలో మూవీ టీ-ం ఉన్నట్లు- సమాచారం. మరి ఆ హీరో ఎవరు అనేది చూడాలి. ప్రజంట్ టాలీవుడ్ బారీ చిత్రాల్లో ఒక్కరైనా బాలీవుడ్ యాక్టర్స్ కచ్చితంగా ఉంటున్నారు. మరి ఈ మూవీలో ఎవరు రాబోతున్నారు చూడాలి.

# ఊరమాస్ లుక్‌లో సుహాస్



నటుడు సుహాస్ ఈ నడుమ మంచి కంటెంట్ ఉన్న సినిమాలను ఎంచుకుంటున్నాడు. తాజాగా ఆయన నటిస్తున్న మూవీ మండాడి. కోలీవుడ్ నటుడు సూరితో కలిసి ఈ సినిమా చేస్తున్నాడు. తమిళ డైరెక్టర్ మతిమారన్ ఈ మూవీని తెరకెక్కిస్తున్నాడు. తాజాగా మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇందులో సుహాస్ ఊరమాస్ లుక్ లో వైల్డ్ గా కనిపిస్తున్నాడు. గడ్డం, పొడవాటి జుట్టు-తో రగ్డ్ లుక్ లో ఉన్నాడు. పైగా టీ-షర్టు, లుంగీలో కనిపిస్తున్నాడు. ఇది విలేజ్ స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో వస్తున్నట్టు- తెలుస్తోంది. టీ-షర్టు మీద టీ- సునామీ రైడర్స్ అని రాసి ఉంది. ఇదేదో కబడ్డీ ఆట నేపథ్యంలో సాగుతున్నట్టు- ఉంది. ఇంకో పోస్టర్ లో సూరి, సుహాస్ సముద్రంపై పడవల్లో సీరియస్ లుక్ లో కనిపిస్తున్నారు. ఈ రెండు లుక్స్ ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నాయి. సుహాస్ ఇలాంటి సీరియస్ లుక్ లో ఇప్పటి వరకు కనిపించలేదు. ఇంత రగ్డ్ లుక్ తో కనిపిస్తుండటంతో ఈ మూవీపై ఒక్కసారిగా హైప్ పెరుగుతోంది. ఇప్పటి వరకు ఈ సినిమా గురించి టాలీవుడ్ లో పెద్దగా తెలియదు. కానీ ఈ ఒక్క పోస్టర్ తోనే టాలీవుడ్ అ-టె-న్షన్ మొత్తం తనవైపు మళ్లించుకున్నాడు సుహాస్. మంచి కథలు ఎంచుకునే ఈ హీరో.. ఈ మండాడిలో ఇంకెలా ఉంటాడో అని అంతా వెయిట్ చేస్తున్నారు.



# నానితో నటించడానికి నో చెప్పిన రష్మిక

హీరోల కెరీర్ విషయంలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేరు. దానికి బిగ్ ఎగ్జాంపుల్ హీరో నాని.. ముందు అసిస్టెంట్ డైరెక్టర్ గా వర్క్ చేసి 'అష్టాచమ్మా' సినిమాతో తెలుగు ఇండస్ట్రీ లో హీరోగా ఎంట్రీ ఇచ్చారు. కానీ నాని హీరోగా ట్రై చేస్తున్నా సమయంలో చాలా అవమానాలు ఎదుర్కొన్నారట . నువ్వు ఇండస్ట్రీలోకి సెట్ కావు.. నీ ఫేస్ కి అంత సీన్ లేదు ..ఇలా రకరకాలుగా మాట్లాడారట. అంతేకాదు నాని ఇండస్ట్రీలో హీరోగా సెటిల్ అయ్యి, హిట్స్ కొట్టిన తర్వాత కూడా చాలామంది హీరోయిన్లు ఆయన తో నటించాడిని నిరాకరించారట. ఇక ఓ హీరోయిన్ అయితే నానికి ఏకంగా మూడు సార్లు రిజెక్ట్ చేసిందట.

ఇంతకి ఆ హీరోయిన్ మరెవరో కాదు..రష్మిక మందన్నా. హా.. నేషనల్ క్రష్ గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న రష్మిక నాని తో మూడుసార్లు సినిమా చేసే అవకాశం దక్కించుకుందట. కానీ మూడు సార్లు ఆమె ఆ సినిమా రిజెక్ట్ చేసిందట. ఇందులో ఎంత వరకు నిజం ఉందో తెలియదు కానీ, సోషల్ మీడియాలో ఈ న్యూస్ బాగా వైరల్ అవుతోంది. ఇప్పుడు కనుక చూసుకుంటే నాని రష్మికకు మించిన స్థాయిలోనే క్రేజీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు. రీసెంట్‌గా 'హిట్ 3' మూవీతో నాని పేరు ఇండస్ట్రీలో మారుమ్రోగిపోతుంది. ఇది అందరికి సాధ్యం కాదు. కానీ నాని తన ట్యాలెంట్ తో సాదించుకున్నాడు. ఇప్పుడు నాని తో మూవీ అంటే ఏ హీరోయిన్ రిజక్ట్ చేసే ఛాన్స్ కూడా లేదు.

# స్టార్ బ్యూటీల సరసన మానుషీ చిల్లర్



వైఆర్ ఎఫ్ స్పై యూనివర్స్ లో భాగంగా తొలి మహిళా గుఢాచర్య చిత్రం ఆల్ఫా ఆన్ సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. అలియాభట్ , శర్వారీ వాఘ్ ప్రధాన పాత్రల్లో శివ్ రావెల్ ప్రతిష్టాత్మకంగా తెరకె క్కిస్తున్నారు. మునుపెన్నడు చూడని భారీ యాక్షన్ థ్రిల్లర్ గా రూపొందుతుంది. వైఎర్ ఎఫ్ బ్యానర్ ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది. అలియా, శర్వారీ వాఘ్ సాహసోపేతమైన సన్నివేశాలతో అలరించడ ఖాయమంటూ ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.రియలిస్టిక్ ఎక్స్ పీరియన్స్ అందించడం కోసం నటీమణులిద్దరు ఎక్కడా రాజీపడకుండా నటిస్తున్నారు. ఈ సినిమాకు హాలీవుడ్ స్టంట్ మాస్టర్లు పనిచేస్తున్నారు. అయితే ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో తాజాగా మానుషీ చిల్లర్ కూడా భాగమైంది. అమ్మడు ఇందులో ఓకీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. దీంతో మానుషీ పాత్ర ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. అలియా, శార్వరీ పాత్రలపై అంచనాలు పీక్స్ లో ఉన్నాయి.ఇద్దరు పోటా పోటీగా నటిస్తున్నారు. మరి మానుషీ పాత్ర తెరపై కనిపించినంతసేపైనా విజిల్స్ వేయించాలా? ఉంటుందా? అన్నది చూడాలి. ఈ బ్యూటీ టాలీవుడ్ కి సుపరిచితమే. మెగా వారసుడు వరుణ్ తేజ్ హీరోగా నటించిన ఆపరేషన్ వాలైంటైన్ లో హీరోయిన్ గా నటించింది. అదే అమ్మడికి తొలి తెలుగు సినిమా. కానీ ఆ సినిమా అంచనాలు అందుకోవడంలో విఫలమైంది. ఆ తర్వాత మళ్లీ తెలుగులో ఛాన్స్ రాలేదు.ప్రస్తుతం బాలీవుడ్ లో మాత్రం రెండు సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తోంది. మాలిక్%-, -%టెహ్రాన్ చిత్రాలు ఆన్ సెట్స్ లో ఉన్నాయి. తాజాగా ఆల్ఫాలో ఛాన్స్ అందుకోవడంతో మానుషీ పేరు బాలీవుడ్ లో జోరుగా మారుమ్రోగుతుంది. బాలీవుడ్ లో మానుషీ కెరీర్ సామ్రాట్ పృధ్వీరాజ్ తో మొదలైన సంగతి తెలిసిందే.

# శ్రీతేజ్ కోలుకోవడం కోసం మా కుటుంబం అంతా ఎదురుచూస్తోంది: అల్లు అరవింద్



అల్లు అర్జున్ సినిమా 'పుష్ప-2' సినిమా విడుదల సందర్భంగా జరిగిన దురదృష్టకర ఘటనలో గాయపడిన చిన్నారి శ్రీతేజ్‌ను సినీ నిర్మాత అల్లు అరవింద్ నేడు పరామర్శించారు. కొన్ని నెలల పాటు ఆసుపత్రిలో చికిత్స పొంది, ఇటీవలే డిశ్చార్జ్ అయిన శ్రీతేజ్... ప్రస్తుతం రీహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో అల్లు అరవింద్ స్వయంగా రీహాబ్ సెంటర్‌కు వెళ్లి శ్రీతేజ్‌ను కలిసి, అతడి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ, శ్రీతేజ్ ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతుండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. "శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని మా కుటుంబం మొత్తం ఎదురుచూస్తోంది. చిన్నారి రోజురోజుకు కోలుకుంటున్నట్లు తెలియడం చాలా సంతోషంగా ఉంది. చికిత్సకు శ్రీతేజ్ బాగా సహకరిస్తున్నాడని వైద్యులు చెప్పారు. త్వరలోనే శ్రీతేజ్ పూర్తిగా కోలుకుని అందరిలాగే సాధారణ జీవితం గడుపుతాడని ఆశిస్తున్నాను" అని అల్లు అరవింద్ అన్నారు. శ్రీతేజ్ వైద్య ఖర్చుల నిమిత్తం ఇప్పటికే అల్లు అర్జున్ రూ. 2 కోట్లు అతని ఖాతాలో జమ చేసిన విషయాన్ని కూడా అరవింద్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ తో పాటు మరో నిర్మాత బన్నీ వాసు కూడా ఉన్నారు.'పుష్ప-2' సినిమా విడుదల రోజున హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన ప్రమాదంలో శ్రీతేజ్ తీవ్రంగా గాయపడిన సంగతి విదితమే. నెలల తరబడి ఆసుపత్రిలో చికిత్స పొందిన శ్రీతేజ్, కొద్ది రోజుల క్రితమే డిశ్చార్జ్ అయ్యాడు. అయితే, పూర్తిగా కోలుకోవడానికి మరికొంత సమయం పడుతుందని, అందుకోసమే అతన్ని రీహాబిలిటేషన్ సెంటర్‌కు తరలించినట్లు వైద్యులు గతంలో వెల్లడించారు. అల్లు అరవింద్ తాజా పరామర్శతో శ్రీతేజ్‌కు అల్లు కుటుంబం అండగా నిలుస్తోందని మరోసారి స్పష్టమైంది

# దుల్కర్ సల్మాన్ 40వ సినిమా ప్రారంభం



దుల్కర్ సల్మాన్ హీరోగా, నహాస్ హిదాయత్ దర్శకత్వంలో రూపొందుతున్న ప్రతిష్టాత్మకమైన సినిమా 'ఐ యామ్ గేమ్' తిరువనంతపురంలో గ్రాండ్ పూజతో షూటింగ్ ప్రారంభమైంది. ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మానే తన స్వంత బ్యానర్ వేఫారర్ ఫిలమ్స్‌పై నిర్మిస్తున్నారు. పూజ కార్యక్రమానికి ప్రధాన తారాగణం హాజరయ్యారు. అందులో ప్రముఖ నటులు యాంటోని వర్గీస్, తమిళ దర్శక-నటుడు మిస్కిన్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కథను సజీర్ బాబు, ఇస్మాయిల్ అబుబక్కర్, బిలాల్ మొయిదు అందించారు. డైలాగ్ రైటర్స్ గా ఆధర్ష్ సుకుమారన్, షహబాస్ రషీద్ పని చేస్తున్నారు. ఇది దుల్కర్ సల్మాన్‌కు 40వ చిత్రం కావడం విశేషం, అలాగే నహాస్ హిదాయత్ బ్లాక్‌బస్టర్ 'ఆర్‌డిఎక్స్' తర్వాత దర్శకత్వం వహిస్తున్న ప్రాజెక్ట్ కావడం మరో హైలెట్. తిరువనంతపురంలో చిత్రీకరణ మొదటి షెడ్యూల్ కొనసాగుతోంది. ఇది దుల్కర్ ఇప్పటి వరకు చేసిన మలయాళ చిత్రాలలో అత్యంత భారీ బడ్జెట్ చిత్రంగా రూపొందుతోంది. ఇందులో హై-వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు ఉండబోతున్నాయి.